Nityam Nigha 10.09.26_Layout 1 9/10/2026 6:34 AM Page 1

RNI. TGTEL/25/A1665

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక



బూర నగేష్ గౌడ్
ఎడిటర్

మండలాలవారీగా
విలేకరులు కావలెను
సీనియర్లకు ప్రాధాన్యత
ఐడి కార్డు, ట్యాగ్, లోగో, వెహికల్ స్టిక్కర్స్ ఇవ్వబడును
ఆసక్తి, అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు
94419 74025
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా

www.nityamnigha.com
RNI. TGTEL/25/A1665
నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక
NITYAM NIGHA TELUGU DAILY
మూసివేయలేని కన్ను - నిత్యం నిఘా
Published From : Warangal
Circulated at : Telangana All Districts



వరంగల్ | సంపుటి 2 | సంచిక 69 | ఎడిటర్ - బూర నగేష్ గౌడ్ | గురువారం 10.09.2026 | పేజీలు : 8 | వెల : 4/-

గవర్నర్‌ను కలిసిన కేటీఆర్..
కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ




- గవర్నర్‌తో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ భేటీ
- 1000 రోజులు గడిచినా కాంగ్రెస్ హామీలు నెరవేర్చలేదని విమర్శ
- తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులు చేశారని ఫిర్యాదు
- దాడులకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు అందజేత
- రైతు బంధు, నిరుద్యోగ సమస్యలపై ప్రభుత్వ వైఫల్యంపై ఆరోపణ

»2


ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్ర
- కేసీఆర్‌పై అసెంబ్లీలో రేవంత్ ఆరోపణలు

- స్పీకర్‌ను దూషించడంపై రేవంత్ ఆగ్రహం
- ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధమని వెల్లడి
- బీఆర్ఎస్ సభ్యులను ఉసి గొలిపారని విమర్శ
- స్పీకర్‌కు కేసీఆర్ క్షమాపణ చెప్పలేదని వ్యాఖ్య



నిత్యం నిఘా, హైదరాబాద్ : అసెంబ్లీ స్పీకర్‌ను దూషించిన ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్రంగా స్పందించారు. స్పీకర్‌పై మాటల దాడికి పాల్పడటం పార్లమెం ట్, ముంబయి, పుల్వామా దాడులతో సమానమని వ్యాఖ్యా నించారు. ప్రజాసమస్యలపై చర్చ జర గకుండా అడ్డుకునేందుకు బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కుట్రకు తెరతీశారని ఆరోపించారు. శాస నసభలో బుధవారం మాట్లాడిన సీఎం.. స్పీకర్ స్థానాన్ని, ఆయన తల్లిని అవమా నించడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. స్పీకర్‌ను దూషించిన ఘటనను సభ్యులంతా ముక్తకంఠంతో ఖండించారని తెలిపారు. ఇలాంటి ఘటన తర్వాత కేసీఆర్ స్వయంగా స్పీకర్‌తో మాట్లాడి క్షమాపణలు చెబుతారని ప్రజా స్వామ్యవాదులు భావించారని అన్నారు. కానీ కేసీఆర్ అలా చేయలేదని విమ ర్శించారు. ప్రజాసమస్యలపై చర్చకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని రేవంత్‌రెడ్డి తెలిపారు. ఈ సమస్యలు చర్చకు వస్తే తమ గుట్టు రట్టవుతుందనే భయంతోనే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌లో కేసీఆర్ కుట్రకు తెరతీశారని ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులను ఉసిగొలిపి సభకు పంపిం చారని మండిపడ్డారు. ఎక్కడైతే ఈ కుట్రకు తెరలేచిందని ఆరోపించారో.. అదే ఎర్రవల్లి ఫామ్‌హౌస్‌కు వెళ్లి డప్పులు వాయించేందుకు ప్రయత్నిస్తే అక్కడ శుద్ధీకరణ చేశారని రేవంత్ అన్నారు. ఉత్త రాఖండ్‌లో ఖర్దే నిరసనలో పాల్గొన్న మైదానాన్ని శ్రీరామసేన శుద్ధీకరణ చేసిందని గుర్తుచేశారు. ఇలాంటి దురదృ ష్టకర ఘటన తెలంగాణలోనూ చోటుచేసు కుందని వ్యాఖ్యానించారు. స్పీకర్ స్థానాన్ని అవమానించడం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానించడమేనని సీఎం పేర్కొన్నారు. సభలో సభ్యులు బాధ్యతగా వ్యవహరించాలని, ప్రజాసమస్యలపై చర్చకు సహకరించాలని కోరారు.

అసెంబ్లీలో కేటీఆర్, హరీశ్‌రావు సహా
సభ్యుల సస్పెన్షన్



- ఎర్రవల్లి వద్ద 'చావుడప్పు' నిరసనలపై బీఆర్ఎస్ సభ్యుల ఆందోళన
- సభను అడ్డుకుంటున్నారని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపణ
- బీఆర్ఎస్ సభ్యుల సస్పెన్షన్‌పై తీర్మానం
- సభ జరిగే అన్ని రోజులకూ సస్పెన్షన్ వర్తింపు
- అనంతరం సభ 10 నిమిషాలు వాయిదా

»2

కేసీఆర్ ఫాంహౌస్ వద్ద శుద్ధి
అసెంబ్లీలో తీవ్ర దుమారం



- నిన్న కేసీఆర్ ఫాంహౌస్ వద్ద నిరసన తెలిపిన కాంగ్రెస్ ఎస్సీ విభాగం, దళిత సంఘాలు
- ఆ ప్రాంతాన్ని బీఆర్ఎస్ నేతలు శుద్ధి చేశారన్న మంత్రి అడ్లూరి లక్ష్మణ్
- దళితుల పట్ల వివక్షను బీఆర్ఎస్ మరోసారి నిరూపించుకుందని మండిపాటు

నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణ శాసనసభ మూడో రోజు సమావేశాలు ప్రారంభం కాగానే సభలో తీవ్ర దుమారం చెలరేగింది. నిన్న సిద్దిపేట జిల్లా ఎర్రవె ల్లిలోని కేసీఆర్ ఫాంహౌస్ వద్ద కాంగ్రెస్ ఎస్సీ విభాగం నేతలు, దళిత సంఘాలు నిరసన తెలిపిన అనంతరం... బీఆర్ఎస్ నేతలు ఆ ప్రాంతాన్ని శుద్ధి చేశారంటూ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ సభలో తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. దళితులు నిరసన తెలిపి వెళ్లిన స్థలాన్ని శుద్ధి చేయడం వెనుక బీఆర్ఎస్ నాయకుల తీవ్రమైన ... »2

E20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ప్రకటన.. కేంద్రానికి మద్దతు

- E20 పెట్రోల్‌తో వాహనాలకు నష్టం లేదన్న మంత్రి పొన్నం ప్రభాకర్ »2
- తమకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని అసెంబ్లీలో వెల్లడి
- ఈ విషయంలో కేంద్ర ప్రభుత్వ వాదనకు తెలంగాణ మద్దతు




ఇది బీఆర్ఎస్ సస్పెన్షన్ కాదు..
ప్రజా సమస్యలపై వేసిన సస్పెన్షన్ వేటు : హరీశ్ రావు



- అసెంబ్లీ నుంచి బీఆర్ఎస్ సభ్యులను సస్పెండ్ చేసిన స్పీకర్
- బీఆర్ఎస్ సభ్యులను కక్షపూరితంగా సస్పెండ్ చేశారన్న హరీశ్
- ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నామనే భయంతోనే కుట్రలు చేస్తున్నారని మండిపాటు

»2

ఆ బూతులు భరించలేకనే
కడుపు మండి మాట్లాడా!
- కేసీఆర్ పై వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్యే శంకర్ వివరణ



- ఒకరి చావును కోరడం సమర్థనీయం కాదన్న శంకర్
- సీఎం, స్పీకర్ లను బీఆర్ఎస్ నేతలు దూషిస్తున్నారని మండిపాటు
- కడుపు మండి మాట్లాడాల్సి వచ్చిందని వ్యాఖ్య

»2

యూపీ ఎన్నికల తర్వాత ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే..
బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు : బండి సంజయ్

- రాబోయే ఎన్నికల్లో తెలంగాణలో అధికారంలోకి వచ్చేది బీజేపీనే అన్న బండి సంజయ్
- కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని వ్యాఖ్య
- పోలీసుల కేసులకు భయపడాల్సిన అవసరం లేవన్న సంజయ్



నిత్యం నిఘా, హైదరాబాద్ : తెలంగాణలో రాబోయే ఎన్నికల్లో బీజేపీ అధికారంలోకి రావడం ఖాయమని, ఈ విజయాన్ని ఏ శక్తీ ఆపలేదని కేంద్ర సహాయ మంత్రి బండి సంజయ్ ధీమా వ్యక్తం చేశారు. రాబోయే ఉత్తరప్ర దేశ్ అసెంబ్లీ ఎన్నికలు ముగిసిన వెంటనే బీజేపీ అధిష్ఠానం దృష్టి పూర్తిగా తెలంగాణపైనే ఉంటుందని, రాష్ట్రాన్ని దక్కించుకోవడమే తదుపరి లక్ష్యమని వెల్లడిం చారు. భద్రాచలంలో నిర్వహించిన బీజేపీ కార్యకర్తలు, నాయకుల విస్తృత స్థాయి సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఉమ్మడి ఖమ్మం జిల్లాకు చెందిన ఒక కాంగ్రెస్ మంత్రి ఢిల్లీకి .... »2

Nityam Nigha 10.09.26_Layout 1 9/10/2026 6:34 AM Page 2

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

కేసీఆర్ ఫాంహౌస్ వద్ద శుద్ధి అసెంబ్లీలో తీవ్ర దుమారం

మొదటిపేజీ తరువాయి.. కులతత్వం బయటపడిందని... ఇది యావత్ దళిత సమాజ ఆత్మగౌరవాన్ని, హక్కులను తీవ్రంగా అవమానించడమేనని విమర్శించారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను అసెంబ్లీ గేటు వద్ద బూతులు తిట్టిన అంశాన్ని మరిచిపోకముందే... బీఆర్ఎస్ మరోసారి దళితుల పట్ల తమకున్న వివక్షను నిరూపించుకుందని మండిపడ్డారు. ఈ శుద్ధి వ్యవహారంపై సభలో సమగ్ర చర్చ జరగాలని ఆయన పట్టుబట్టారు. మరోవైపు, మంత్రి ప్రసంగానికి అడ్డుతగులుతూ బీఆర్ఎస్ సభ్యులు వెల్‌లోకి దూసుకొచ్చి తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. అసెంబ్లీ ఆవరణలో బీఆర్ఎస్ మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరుపై, వారిపై జరిగిన అనుచిత ప్రవర్తనపై ప్రభుత్వం తక్షణమే బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ప్లకార్డులతో నినాదాలు చేశారు. ఇరువైపులా నేతల పోటాపోటీ నినాదాలు, హంగామాతో సభలో తీవ్ర గందరగోళం నెలకొంది.

యూపీ ఎన్నికల తర్వాత ఫుల్ ఫోకస్ తెలంగాణపైనే..

బీజేపీ గెలుపును ఎవరూ ఆపలేరు

- బండి సంజయ్

మొదటిపేజీ తరువాయి..

అక్రమ మార్గాల్లో మూటలు పంపుతున్నారని, గతంలో కేసీఆర్ పాలనలోనూ అదే మంత్రి బీజేపీ కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి తీవ్రంగా వేధించారని బండి సంజయ్ ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో ఇస్తున్న ఉచిత సన్న బియ్యం, ఇళ్ల పథకాలను కాంగ్రెస్ ప్రభుత్వం తమ సొంత పథకాలుగా ప్రచారం చేసుకుంటూ ప్రజలను మోసం చేస్తోందని విమర్శించారు. గతంలో రజాకార్ల పాలనను తలపించిన కేసీఆర్ సర్కార్ మెడలు వంచింది బీజేపీయేనని గుర్తుచేశారు. "నాపై 109 అక్రమ కేసులు నమోదు చేసినా నేనెప్పుడూ వెనకడుగు వేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై కార్యకర్తలు సైనికుల్లా పోరాడాలి. పోలీసు కేసులకు అస్సలు భయపడాల్సిన అవసరం లేదు" అని భరోసా ఇచ్చారు. దేశాన్ని సుదీర్ఘకాలం ఏలిన కాంగ్రెస్ పార్టీ ప్రస్తుతం కేవలం నాలుగు రాష్ట్రాలకే పరిమితమైందని, తెలంగాణలో కూడా ఆ ప్రభుత్వంపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత మొదలైందని బండి సంజయ్ వ్యాఖ్యానించారు.

కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారు

- మహేశ్ గౌడ్

కేసీఆర్‌కు హాని జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం కోరుకోలేదన్న మహేశ్ గౌడ్

కేసీఆర్ గతంలో గాయపడినప్పుడు సీఎం రేవంత్ వెంటనే స్పందించారని వెల్లడి

కేసీఆర్‌కు రాష్ట్రంలో అత్యధిక భద్రత ఉందని వివరణ

సిరిసిల్లలో సీఎం రేవంత్‌కు పిండ ప్రదానంపై మహేశ్ గౌడ్ ప్రశ్నలు

హరీశ్‌రావు క్షుద్ర పూజలు చేస్తున్నారని కవిత మాట్లాడిన వీడియోలు ఉన్నాయని వ్యాఖ్య



నిత్యం నిఘా, హైదరాబాద్, సెప్టెంబర్ 9 : బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌కు హాని జరగాలని కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ కోరుకోలేదని టీపీసీసీ అధ్యక్షుడు, ఎమ్మెల్సీ బి. మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. ప్రతిపక్ష నేతగా ఆయనకు తగిన గౌరవం ఇస్తున్నట్లు తెలిపారు. బీఆర్ఎస్ నేతలే సీఎం రేవంత్ రెడ్డి పట్ల అనుచితంగా ప్రవరిస్తున్నారని మండిపడ్డారు. అసెంబ్లీ మీడియా పాయింట్‌లో బుధవారం మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడారు. కేసీఆర్ గతంలో బాత్‌రూమ్‌లో జారిపడినప్పుడు సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే స్పందించారని చెప్పారు. అర్ధరాత్రి గ్రీన్ ఛానల్ ద్వారా ఆసుపత్రికి తరలించి మెరుగైన వైద్యం అందించారని తెలిపారు. కేసీఆర్ అసెంబ్లీకి వచ్చినప్పుడు సీఎం స్వయంగా ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారని చెప్పారు. సీఎం తర్వాత రాష్ట్రంలో అత్యధిక భద్రత పొందుతున్న వ్యక్తి కేసీఆర్ అని పేర్కొన్నారు. సిరిసిల్లలో సీఎం రేవంత్‌రెడ్డికి బీఆర్ఎస్ నేతలు పిండ ప్రదానం చేయడం ఎంత వరకు సమంజసమని మహేశ్ గౌడ్ ప్రశ్నించారు. స్పీకర్ పదవిపై బీఆర్ఎస్ నేత తాతా మధు చేసిన వ్యాఖ్యలపైనా ఆయన మండిపడ్డారు. బీఆర్ఎస్ నేతల దిగజారుడు రాజకీయాలను తెలంగాణ సమాజం ఖండిస్తోందన్నారు. కేసీఆర్ ప్రాణాలకు ప్రమాదం ఉందంటూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డ్రామాలు ఆడుతున్నారని ఆరోపించారు. కేసీఆర్‌కు చెడు జరగాలని ఆయన సొంత కుటుంబ సభ్యులే కోరుకుంటున్నారని వ్యాఖ్యానించారు. హరీశ్‌రావు క్షుద్ర పూజలు చేస్తున్నారని కవిత మాట్లాడిన వీడియోలు ఉన్నాయని చెప్పారు. కేసీఆర్‌పై కాంగ్రెస్‌కు గౌరవం ఉందని మహేశ్ గౌడ్ అన్నారు. ఆయన త్వరగా కోలుకుని అసెంబ్లీకి రావాలని కోరుకుంటున్నామని చెప్పారు. దళితులు, బలహీన వర్గాలకు న్యాయం చేసేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కట్టుబడి ఉందని స్పష్టం చేశారు.

అసెంబ్లీలో కేటీఆర్, హరీశ్‌రావు సహా సభ్యుల సస్పెన్షన్

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణ అసెంబ్లీలో బీఆర్ఎస్ సభ్యులపై స్పీకర్ సస్పెన్షన్ వేటు వేశారు. కేటీఆర్, హరీశ్‌రావు, తలసాని శ్రీనివాస్ యాదవ్, కోవా లక్ష్మి, సునీతా లక్ష్మారెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డితో పాటు బీఆర్ఎస్ సభ్యులను సభ నుంచి సస్పెండ్ చేశారు. ఈ సెషన్‌లో సభ జరిగే అన్ని రోజులకు ఈ సస్పెన్షన్ వర్తించనుంది. సభ ప్రారంభమైన కొద్దిసేపటికే బీఆర్ఎస్ సభ్యులు నిన్నటి ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద 'చావుడప్పు' నిరసనలపై ఆందోళనకు దిగారు. దీంతో సభలో గందరగోళం నెలకొంది. బీఆర్ఎస్ సభ్యులు సభా కార్యక్రమాలను అడ్డుకుంటున్నారని మంత్రి శ్రీధర్‌బాబు ఆరోపించారు. దాదాపు గంటసేపటి నుంచి బీఆర్ఎస్ సభ్యులు సభను అడ్డుకుంటున్నారని మంత్రి తెలిపారు. వారిని సస్పెండ్ చేయాలని స్పీకర్‌ను కోరుతూ తీర్మానం ప్రవేశ పెట్టారు. ఈ తీర్మానాన్ని సభ ఆమోదించింది. దీంతో బీఆర్ఎస్ సభ్యులను ప్రస్తుత అసెంబ్లీ సమావేశాల నుంచి సస్పెండ్ చేస్తూ స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. అనంతరం సభను 10 నిమిషాల పాటు వాయిదా వేశారు.

గవర్నర్‌ను కలిసిన కేటీఆర్.. కాంగ్రెస్ సర్కార్‌పై ఫిర్యాదుల వెల్లువ

మొదటిపేజీ తరువాయి.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నేతృత్వంలోని పార్టీ ఎమ్మెల్యేల బృందం బుధవారం రాజ్‌భవన్‌లో గవర్నర్‌తో భేటీ అయ్యింది. రాష్ట్రంలో శాంతిభద్రతలు క్షీణించాయని, కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరిస్తోందని ఈ సందర్భంగా వారు గవర్నర్‌కు ఫిర్యాదు చేశారు. తమ పార్టీ ఎమ్మెల్యేలపై పోలీసులు దాడులకు పాల్పడ్డారని ఆరోపిస్తూ, అందుకు సంబంధించిన ఆధారాలను గవర్నర్‌కు సమర్పించారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కాంగ్రెస్ ప్రభుత్వ 1,000 రోజుల పాలనకు నిరసనగా నల్ల చొక్కాలు ధరించి అసెంబ్లీకి వెళ్లిన తమ ఎమ్మెల్యేలపై పోలీసులు దౌర్జన్యం చేశారని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డిని అవమానించారని, ఈ దాడులపై కమిషనర్ కార్యాలయంలో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదని పేర్కొన్నారు. దీనికి విరుద్ధంగా తమ పార్టీ నేతలపైనే అక్రమంగా కేసులు బనాయించారని ఆయన మండిపడ్డారు. వంద రోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని నమ్మబలికిన కాంగ్రెస్, 1,000 రోజులు గడిచినా 420కి పైగా వాగ్దానాలను గాలికొదిలేసిందని కేటీఆర్ విమర్శించారు. బీఆర్ఎస్ హయాంలో రైతుబంధు కింద రూ. 73,000 కోట్లు అందిస్తే, ప్రస్తుత ప్రభుత్వం కనీసం యూరియాను కూడా సరఫరా చేయలేని దుస్థితిలో ఉందని ఎద్దేవా చేశారు. రైతు బీమాను నీరుగార్చి, నిరుద్యోగ యువతను మోసం చేస్తోందని ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో నెలకొన్న ఈ పరిణామాలపై తక్షణమే జోక్యం చేసుకోవాలని గవర్నర్‌ను కోరినట్లు కేటీఆర్ వివరించారు.

ఇది బీఆర్ఎస్ సస్పెన్షన్ కాదు..

ప్రజా సమస్యలపై వేసిన సస్పెన్షన్ వేటు: హరీశ్ రావు

మొదటిపేజీ తరువాయి.. తెలంగాణ శాసనసభ నుంచి బీఆర్ఎస్ సభ్యులను ఈ సెషన్ ముగిసేంత వరకు సస్పెండ్ చేయడంపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నేత హరీశ్ రావు తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. సస్పెన్షన్ కు గురైన తర్వాత మీడియా పాయింట్‌లో ఆయన మాట్లాడుతూ... కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న ఈ చర్య బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై వేసిన వేటు కాదని, తెలంగాణ ప్రజల సమస్యలపై విధించిన సస్పెన్షన్ అని ఆగ్రహం వ్యక్తం చేశారు. తమ హక్కుల కోసం, మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడి ఘటనలపై అసెంబ్లీ వేదికగా ప్రభుత్వాన్ని నిలదీస్తున్నందుకే కక్షపూరితంగా సస్పెండ్ చేశారని మండిపడ్డారు. "ప్రజలేమో 'మా సమస్యలపై మాట్లాడండి' అని అడుగుతుంటే... రేవంత్ రెడ్డి మాత్రం 'సభ నుంచి బీఆర్ఎస్‌ను బయటకు తోసేయండి' అని మార్షల్స్‌ను ఆదేశిస్తున్నారు" అని హరీశ్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతున్నామనే భయంతోనే ప్రతిపక్షం గొంతు నొక్కే కుట్రలు చేస్తున్నారని విమర్శించారు. నియంతృత్వం ఎంత పెరిగితే.. ప్రజా తిరుగుబాటు అంత బలపడుతుంది అన్న విషయాన్ని రేవంత్ రెడ్డి గుర్తుంచుకోవాలి అని ఆయన హెచ్చరించారు.

ఆ బూతులు భరించలేకనే కడుపు మండి మాట్లాడా!

- కేసీఆర్ పై వ్యాఖ్యల పట్ల ఎమ్మెల్యే శంకర్ వివరణ

మొదటిపేజీ తరువాయి.. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను ఉద్దేశించి తాను చేసిన వ్యాఖ్యలపై చెలరేగిన రాజకీయ దుమారంపై కాంగ్రెస్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ స్పందిస్తూ మీడియా వేదికగా వివరణ ఇచ్చారు. వ్యక్తిగతంగా ఏ ఒక్కరి చావును కోరుకోవడం ఎట్టి పరిస్థితుల్లోనూ సమర్థనీయం కాదని ఆయన అంగీకరించారు. అయితే, సభలోనూ బయటా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని, దళిత వర్గానికి చెందిన అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌ను, మహిళా మంత్రులను బీఆర్ఎస్ నేతలు అత్యంత అసభ్యకరంగా, కులాల పేరుతో దూషిస్తూ లక్ష్మణరేఖ దాటుతున్నారని ఆరోపించారు. ప్రతిపక్ష నేతల బూతులు వినలేక టీవీలు చూస్తున్న మహిళలు చెవులు మూసుకుంటున్నారని, బీఆర్ఎస్ నేతలు వారి సొంత కుటుంబ సభ్యులు కూడా తలదించుకునేలా ప్రవర్తిస్తున్నారని మండిపడ్డారు. ఈ క్రమంలోనే అసెంబ్లీకి రాకుండా దూరంగా ఉంటున్న కేసీఆర్ వెంటనే సభకు వచ్చి ప్రజా సమస్యలపై చర్చలో పాల్గొనాలని కోరే క్రమంలో కడుపు మండి మాట్లాడాల్సి వచ్చిందని స్పష్టం చేశారు. తెలంగాణ నాలుగు కోట్ల ప్రజలదని, కేసీఆర్ కుటుంబానికి మాత్రమే సొంతం కాదని వ్యాఖ్యానించారు. ఇదే సమయంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ వైఖరిని కూడా ఎమ్మెల్యే శంకర్ తీవ్రంగా తప్పుబట్టారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చిన సోనియా గాంధీ, రాహుల్ గాంధీని ఉద్దేశించి, "ఎక్కడ సచ్చిండు రాహుల్ గాంధీ?" అంటూ మూడు రోజుల క్రితం కరీంనగర్ పర్యటనలో కేటీఆర్ మాట్లాడిన వీడియో క్లిప్పింగ్‌లను ఆయన మీడియా సమక్షంలో ప్రదర్శించారు. కాంగ్రెస్ అగ్ర నేతలపై అంతటి దిగజారుడు పదజాలాన్ని ఉపయోగించిన బీఆర్ఎస్ నేతలు, ఇప్పుడు తమకు నీతులు చెప్పడం విడ్డూరంగా ఉందని విమర్శించారు.

E20 ఇంధనంపై తెలంగాణ కాంగ్రెస్ ప్రభుత్వం కీలక ప్రకటన.. కేంద్రానికి మద్దతు..

మొదటిపేజీ తరువాయి.. ఇథనాల్ కలిపిన ఈ20 పెట్రోల్ వాడకం వల్ల వాహనాలు దెబ్బతింటున్నాయన్న ప్రచారంలో వాస్తవం లేదని తెలంగాణ రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ అంశంపై రాష్ట్రంలో తమకు ఇప్పటి వరకు ఎలాంటి ఫిర్యాదులు అందలేదని ఆయన శాసన సభలో వెల్లడించారు. ఈ20 పెట్రోల్ వల్ల వాహనాలు పాడవుతున్నట్లు వాహన యజమానుల నుంచి గానీ, ఆటోమొబైల్ రంగ నిపుణుల నుంచి గానీ రవాణా శాఖ దృష్టికి ఎటువంటి సమాచారం రాలేదని మంత్రి తెలిపారు. "ప్రస్తుతం ఈ అంశానికి సంబంధించి మా వద్ద ఎటువంటి ప్రతికూల నివేదికలు లేవు. అందువల్ల, దీనిపై ప్రత్యేక మార్గదర్శకాలు జారీ చేసే లేదా నియంత్రణ చర్యలు చేపట్టే ఆస్కారం లేదు" అని ఆయన వివరించారు. ఈ విషయంలో మంత్రి పొన్నం ప్రభాకర్ కేంద్ర ప్రభుత్వ వైఖరితోనే ఏకీభవించారు. గత జూలైలో కేంద్ర పెట్రోలియం శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపి సైతం లోక్‌సభలో ఇదే విషయాన్ని స్పష్టం చేశారు. దేశవ్యాప్తంగా 20 కోట్లకు పైగా ద్విచక్ర వాహనాలు, 3 కోట్లకు పైగా పెట్రోల్ కార్లు ఇథనాల్ కలిపిన ఇంధనంతోనే నడుస్తున్నాయని, ఇంజన్ వైఫల్యాలపై ఎటువంటి నిర్దిష్ట ఫిర్యాదులు రాలేదని ఆయన వెల్లడించారు. గతంలో సొసైటీ ఆఫ్ ఇండియన్ ఆటోమొబైల్ మాన్యుఫాక్చరర్స్ (సియామ్), ఈ20 ఇంధనంలోని అధిక తేమ, క్లోరైడ్ స్థాయిల వల్ల సమస్యలు తలెత్తే అవకాశం ఉందని పెట్రోలియం మంత్రిత్వ శాఖకు లేఖ రాసింది. అయితే, ఈ అంశంపై మరింత ధ్రువీకరణ అవసరమని పేర్కొంటూ తదనంతరం ఆ లేఖను ఉపసంహరించుకుంది. ప్రస్తుతం అటు కేంద్రం, ఇటు రాష్ట్ర ప్రభుత్వం ఈ20 ఇంధనం వల్ల వాహనాలకు ఎలాంటి ముప్పు లేదనే అభిప్రాయంతో ఉన్నాయి.

Nityam Nigha 10.09.26_Layout 1 9/10/2026 6:34 AM Page 3

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయాలి



తాడ్వాయి, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : ఈ నెల 15న ములుగు జిల్లా కేంద్రంలోని DLR గార్డెన్స్‌లో నిర్వహించనున్న నాయీబ్రాహ్మణ సంఘం జిల్లా మహాసభను విజయవంతం చేయాలని తాడ్వాయి మండల నాయీబ్రాహ్మణ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. బుధవారం మేడారంలోని కళ్యాణకట్టలో తాడ్వాయి మండల కమిటీ సమావేశం మండల అధ్యక్షుడు మద్దూరి రాములు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా నడిగోటి మల్లయ్య మాట్లాడుతూ జిల్లా మహాసభకు నాయీబ్రాహ్మణ సంఘం సభ్యులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. సంఘం బలోపేతం, నాయీబ్రాహ్మణుల సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఈ మహాసభకు మండలంలోని ప్రతి ఒక్కరూ తరలిరావాలని ఆయన పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో మద్దూరి రాజు, సతీష్, సంతోష్, సందీప్, కిశోర్, కోటి దినేష్, వంశీ తదితరులు పాల్గొన్నారు.

వీర్లపల్లి శంకర్‌ను అరెస్టు చేయాలి



ఎల్కతుర్తి, సెప్టెంబర్09 (నిత్యం నిఘా ప్రతినిధి) : తెలంగాణ తొలి ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌పై చట్టపరమైన చర్యలు తీసుకుని తక్షణమే అరెస్టు చేయాలని బీఆర్ఎస్ నాయకులు డిమాండ్ చేశారు. హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఎల్కతుర్తి పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ నరసింహారావుకు బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పిట్టల మహేందర్ ఆధ్వర్యంలో నాయకులు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా పిట్టల మహేందర్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమించి ప్రజల ఆకాంక్షను నెరవేర్చిన కేసీఆర్‌పై వీర్లపల్లి శంకర్ అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. కేసీఆర్‌పై చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని తెలిపారు. వీర్లపల్లి శంకర్‌పై చట్టప్రకారం చర్యలు తీసుకుని తక్షణమే అరెస్టు చేయాలని పోలీసులను కోరారు. ప్రతిపక్షాల నిరసనలను అడ్డుకోవడం, నాయకులు, కార్యకర్తలను అరెస్టు చేయడం వంటి చర్యలను ప్రభుత్వం విడనాడాలని డిమాండ్ చేశారు. ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి సారించాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ శ్రీపతి రవీందర్ గౌడ్, వైస్ చైర్మన్ మునిగడప శేషగిరి, మాజీ మండల అధ్యక్షుడు ఏల్తూరి స్వామి, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ తంగేడ మహేందర్, మాజీ వైస్ ఎంపీపీ తంగేడ నగేష్, ఎంపీటీసీల ఫోరం మాజీ అధ్యక్షుడు కడారి రాజు, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గొల్ల మహేందర్, మండల ప్రధాన కార్యదర్శి జూపాక జడ్సన్, మాజీ సర్పంచ్ కుర్ర సాంబమూర్తి గౌడ్, సీనియర్ నాయకులు మదన్‌మోహన్‌రావు, వొడితల యువసేన అధ్యక్షుడు చిట్టి గౌడ్, భాష బోయిన సురేష్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

వికలాంగులకు చేయూతనివ్వాలి



మంథని, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : వికలాంగులకు చేయూతనందిస్తూ వారిలో మనోధైర్యాన్ని పెంపొందించే కార్యక్రమాలు చేపట్టాలని ఆర్ఆర్ క్రియేషన్స్ అధినేత, సీనియర్ పాత్రికేయుడు మేడగోని రాజమౌళి గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం ప్రణామ్ డే కేర్ సెంటర్ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ.. మహిళా సాధికార కేంద్రం ఆధ్వర్యంలో వికలాంగులు, వితంతువులకు ప్రభుత్వం అందిస్తున్న వివిధ సంక్షేమ పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. వికలాంగుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక పథకాలను అమలు చేస్తోందని, వాటిని అర్హులైన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా అవగాహన కల్పించేందుకు కృషి చేయాలని అన్నారు. వికలాంగులకు ప్రభుత్వం అందించే సహాయ సహకారాలను పొందే విధంగా సంబంధిత అధికారులు, స్వచ్ఛంద సంస్థలు చొరవ చూపాలని సూచించారు. ఈ సందర్భంగా వృద్ధుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రణామ్ డే కేర్ సెంటర్ సూపరింటెండెంట్ ఖాజా మొయినుద్దీన్, దత్త గౌడ్ తదితరులు పాల్గొని ప్రసంగించారు.

వరంగల్ జిల్లా ఉద్యోగులకు కీలక పిలుపు.. సెప్టెంబర్ 10న చలో హైదరాబాద్





వరంగల్, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : రాష్ట్ర టీజీఈజాక్ పిలుపు మేరకు ఉద్యోగుల పెండింగ్ సమస్యల పరిష్కారం కోసం సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న ★"ఉద్యోగుల హక్కుల సాధన సభ"★ను విజయవంతం చేయాలని టీజీఈజాక్ వరంగల్ జిల్లా చైర్మన్ గాజే వేణుగోపాల్ పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా బుధవారం వరంగల్ జిల్లా పరిధిలోని వివిధ శాఖాధిపతుల కార్యాలయాలను సందర్శించిన ఆయన.. అధికారులను కలిసి ఉద్యోగుల తరలింపుపై చర్చించారు. కలెక్టరేట్, డీఎంహెచ్‌వో, డీఈవో, ఎంజీఎం, సహకార శాఖ, రిజిస్ట్రేషన్ శాఖ, ఐసీడీఎస్, ఖజానా కార్యాలయాలతో పాటు పలు కార్యాలయాల్లో ఉద్యోగులతో సమావేశమై చలో హైదరాబాద్ కార్యక్రమంపై అవగాహన కల్పించారు. అనంతరం టీఎన్జీవో భవన్‌లో నిర్వహించిన జిల్లా అత్యవసర కార్యవర్గ సమావేశానికి హాజరైన గాజే వేణుగోపాల్ మాట్లాడుతూ.. ఉద్యోగుల అపరిష్కృత సమస్యల పరిష్కారం కోసం నిర్వహిస్తున్న ఉద్యోగుల హక్కుల సాధన సభకు అన్ని శాఖల ఉద్యోగులు పెద్ద సంఖ్యలో తరలిరావాలని కోరారు. కొన్ని ప్రచార మాధ్యమాల్లో వస్తున్న వదంతులను ఉద్యోగులు నమ్మవద్దని, ఉద్యోగుల హక్కుల సాధన సభ యథావిధిగా కొనసాగుతుందని స్పష్టం చేశారు. పీఆర్సీ అమలు, పెండింగ్ ఆర్‌డీఏల విడుదల, ఉద్యోగుల పెండింగ్ బకాయిల చెల్లింపు, ఈహెచ్ఎస్‌ను పకడ్బందీగా అమలు చేయడం, పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించడం తదితర డిమాండ్ల సాధన కోసం ఈ సభను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉద్యోగులు తమంతట తాముగా పెద్ద సంఖ్యలో హైదరాబాద్‌కు తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో వరంగల్ జిల్లా టీఎన్జీవోస్ యూనియన్ కార్యదర్శి పాలకుర్తి సదానందం, కోశాధికారి కిరణ్ కుమార్, సిటీ అధ్యక్షులు శంకేష్ రాజేష్, జిల్లా బాధ్యులు ఆనంద్, సతీష్, చిరంజీవి, గణేష్ సదానందం, నాగేశ్వరరావు, వంగ రవీందర్, నాలుగో తరగతి ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు సాంబయ్య, కార్యదర్శి భాను ప్రకాష్, కోశాధికారి ఉదయ్, పంచాయతీ కార్యదర్శులు, వివిధ శాఖల ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

పాఠశాలల్లో అభివృద్ధి పనులు త్వరగా పూర్తి చేయాలి





మంథని, సెప్టెంబర్09 (నిత్యం నిఘా ప్రతినిధి) : పాఠశాలల్లో చేపట్టిన అభివృద్ధి పనులను త్వరితగతిన పూర్తి చేసి, విద్యార్థులకు మెరుగైన మౌలిక వసతులు అందుబాటులోకి తీసుకురావాలని పెద్దపల్లి జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష అధికారులను ఆదేశించారు. బుధవారం మంథని మండలంలోని పలు ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలను ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఖాన్‌సాయిపేట ఎంపీపీఎస్, భట్టుపల్లి ఎంపీపీఎస్, వెంకటాపూర్ ఎంపీపీఎస్, మల్లారం ఎంపీపీఎస్, ఆరెంద జెడ్పీహెచ్ఎస్, స్వర్ణపల్లి ఎంపీపీఎస్ పాఠశాలలను సందర్శించిన కలెక్టర్.. కొనసాగుతున్న అభివృద్ధి పనులు, విద్యార్థులకు అందుతున్న మౌలిక వసతులు, హాజరు, విద్యా బోధన, అభ్యసన స్థాయిపై ఉపాధ్యాయులు, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు.

రహదారి పనులు వెంటనే ప్రారంభించాలి

మంథని మండలంలోని వెంకటాపూర్ నుంచి ఆరెంద వరకు ఉన్న సింగిల్ రోడ్డును డబుల్ రోడ్డుగా విస్తరించే పనులను వెంటనే క్షేత్ర స్థాయిలో ప్రారంభించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రహదారి విస్తరణ పనులు పూర్తయ్యే వరకు ప్రస్తుతం ఉన్న రహదారిపై ఏర్పడిన గుంతలను యుద్ధప్రాతిపదికన పూడ్చి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు.

నిర్మాణ పనుల్లో జాప్యం వద్దు

ఖాన్‌సాయిపేట ఎంపీపీఎస్ పాఠశాలలో కాంపౌండ్ వాల్, పెయింటింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని ఆదేశించారు. వెంకటాపూర్ ఎంపీపీఎస్ పాఠశాలలో మంజూరైన అదనపు తరగతి గది నిర్మాణాన్ని నెల రోజుల్లోగా పూర్తి చేయాలని సూచించారు. పాఠశాలల్లో చేపట్టిన అన్ని అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేసి, విద్యార్థులు కొత్తగా కల్పించిన సౌకర్యాలను పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చూడాలని తెలిపారు.

ప్రతి విద్యార్థికి ప్రాథమిక విద్యా నైపుణ్యాలు కల్పించాలి

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న ప్రతి విద్యార్థిపై ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ చూపాలని కలెక్టర్ సూచించారు. ఎఫ్ఎల్ఎన్ కార్యక్రమంపై ప్రత్యేక దృష్టి సారించి ప్రతి విద్యార్థికి కనీసం చదవడం, రాయడం, ప్రాథమిక గణిత నైపుణ్యాలు వచ్చేలా బోధన అందించాలని ఆదేశించారు. విద్యలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, వారి అభ్యసన స్థాయిని మెరుగుపరిచేందుకు నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ప్రతి విద్యార్థి విద్యా ప్రగతిపై ఉపాధ్యాయులు వ్యక్తిగతంగా శ్రద్ధ చూపాలని తెలిపారు.

హాజరుపై నిరంతర పర్యవేక్షణ

విద్యార్థులు ప్రతిరోజూ పాఠశాలకు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. హాజరు తక్కువగా ఉన్న విద్యార్థుల తల్లిదండ్రులతో సంప్రదించి కారణాలను తెలుసుకుని అవసరమైన చర్యలు చేపట్టాలని సూచించారు. ప్రతి పాఠశాలలో నెలకోసారి తల్లిదండ్రులు–ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించి విద్యార్థుల హాజరు, విద్యా ప్రగతి, అభ్యసన సామర్థ్యాలపై తల్లిదండ్రులకు వివరించాలని తెలిపారు. పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు విద్యార్థుల విద్యా ప్రమాణాల పెంపునకు సమాన ప్రాధాన్యత ఇవ్వాలని, ప్రభుత్వం కల్పిస్తున్న సౌకర్యాలను విద్యార్థులు పూర్తిస్థాయిలో వినియోగించుకునేలా చూడాలని అధికారులను, ఉపాధ్యాయులను కలెక్టర్ ఆదేశించారు. ఈ పర్యటనలో ఎంపీడీవో శ్రీజారెడ్డి, ఎంపీవో షబ్బీర్ పాషా, ఏఈ పి.ఆర్. జగదీశ్, సంబంధిత అధికారులు, ఇంజినీరింగ్ అధికారులు, విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మంథనిలో పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే



మంథని, సెప్టెంబర్09 (నిత్యం నిఘా ప్రతినిధి) : జాతీయ గణాంక శాఖ ఆధ్వర్యంలో దేశవ్యాప్తంగా నిర్వహిస్తున్న పిరియాడిక్ లేబర్ ఫోర్స్ సర్వే (పీఎల్ఎఫ్ఎస్)–2026లో భాగంగా మంథని పట్టణంలో సర్వే కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు గణాంక శాఖ అధికారి గుర్రం శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా మంథని ఆర్డీవో సురేష్, తహసీల్దార్ ఆరిఫోద్దిన్, ఎంపీడీవో శ్రీజ, మున్సిపల్ కమిషనర్ మనోహర్, మేనేజర్ శారదలను కలిసి సర్వేకు సంబంధించిన కరపత్రాలను అందజేశారు. సర్వే లక్ష్యాలు, ప్రాముఖ్యతను వారికి వివరించారు. దేశంలో ఉపాధి, నిరుద్యోగం, కార్మిక శక్తి భాగస్వామ్యం, స్వయం ఉపాధి తదితర అంశాలపై విశ్వసనీయ గణాంకాలను రూపొందించేందుకు ఈ సర్వే నిర్వహిస్తున్నట్లు శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. మొదటి దశలో కుటుంబాల సాధారణ వివరాలను నమోదు చేసి, అనంతరం ఎంపికైన కుటుంబాలను మూడు నెలల పాటు ప్రతి నెలా ఒకసారి సందర్శించి మొబైల్ ట్యాబ్ ద్వారా సమాచారాన్ని సేకరిస్తామని పేర్కొన్నారు. కుటుంబ సభ్యుల విద్యార్హతలు, విద్యాభ్యాసం, వృత్తి విద్య, ఉద్యోగం, స్వయం ఉపాధి, రోజువారీ కూలి పనులు, పని గంటలు, వేతన వివరాలు, మహిళల ఆదాయ వనరులు తదితర వివరాలను నమోదు చేస్తామని తెలిపారు. అలాగే జొమాటో, స్విగ్గీ, రాపిడో, ఓలా, ఉబెర్ వంటి డిజిటల్ ప్లాట్‌ఫారమ్‌ల ద్వారా పనిచేస్తున్న గిగ్, ప్లాట్‌ఫారమ్ కార్మికుల వివరాలను కూడా సేకరిస్తామని వివరించారు. సర్వేలో సేకరించిన సమాచారం పూర్తిగా గోప్యంగా ఉంచబడుతుందని, కేవలం గణాంకాల రూపకల్పనకు మాత్రమే వినియోగిస్తామని స్పష్టం చేశారు. ప్రజలు ఎలాంటి సందేహాలకు తావులేకుండా సరైన సమాచారాన్ని అందించి సర్వే విజయవంతానికి సహకరించాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో మంథని డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, ఎంపీఎస్ఓ సంధ్యారాణి, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు

Nityam Nigha 10.09.26_Layout 1 9/10/2026 6:34 AM Page 4

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

గుండెపోటుతో తాపీ మేస్త్రి మృతి



ఏటూరునాగారం, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : ఏటూరునాగారం మండల కేంద్రంలోని మానసపల్లి గ్రామానికి చెందిన గొట్టే రవి (40) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. దీంతో మానసపల్లి గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. తాపీ మేస్త్రిగా పనిచేస్తున్న రవి కుటుంబాన్ని పోషించుకుంటున్నారు. కొద్దిరోజులుగా తాళ్లగూడెంలో ఇంటి నిర్మాణ పనులు చేస్తూ జ్వరంతో బాధపడుతున్నారు. రెండు రోజుల క్రితం ఇంటికి వచ్చిన ఆయన ఆరోగ్యం క్షీణించడంతో కుటుంబ సభ్యులు ఏటూరునాగారం మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. అయితే శ్వాస తీసుకోవడంలో ఇబ్బంది ఏర్పడటంతో వైద్యుల సూచన మేరకు మెరుగైన వైద్యం కోసం ములుగు జిల్లా కేంద్రానికి తరలించారు. మార్గమధ్యంలో రవికి ఒక్క సారిగా గుండెనొప్పి రావడంతో ములుగు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందించారు. పరిస్థితి విషమించడంతో వైద్యులు వరంగల్‌లోని ఎంజీఎం ఆసుపత్రికి రిఫర్ చేశారు. ఎంజీఎం ఆసుపత్రిలో చికిత్స పొందుతూ రవి మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. భర్త మృతితో భార్య గొట్టే నాగమణి, కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. మృతుడికి భార్య నాగమణితో పాటు పిల్లలు అఖిల, రామ్‌చరణ్ ఉన్నారు. రవి మృతి వార్త తెలియడంతో మానసపల్లి గ్రామంలో విషాద వాతావరణం నెలకొంది. బంధువులు, గ్రామస్థులు కుటుంబ సభ్యులను పరామర్శించి తమ ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు చేసిందేమీ లేదు



హనుమకొండ, సెప్టెంబర్09 (నిత్యం నిఘా ప్రతినిధి) : తెలంగాణ రాష్ట్రంలో ఏళ్ల తరబడి అధికారంలో ఉన్న కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజలకు చేసిందేమీ లేదని జనసేన పార్టీ నాయకుడు కరాటే ప్రభాకర్ విమర్శించారు. ఆ రెండు పార్టీలు ప్రజల నమ్మకాన్ని తీవ్రంగా వమ్ము చేశాయని ఆరోపించారు. బుధవారం హనుమకొండలోని అదాలత్ జంక్షన్ వద్ద జనసేన పార్టీ శ్రేణులతో కలిసి నిర్వహించిన నిరసన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ సమాజంలో కొనసాగుతున్న అన్యాయాలు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు, పాలకుల నిరంకుశ వైఖరిని గుర్తించిన జనసేన అధినేత పవన్ కళ్యాణ్ ప్రజలకు అండగా నిలిచేందుకే తెలంగాణలో జనసేన పార్టీని బలోపేతం చేస్తున్నారని పేర్కొన్నారు.రాబోయే రోజుల్లో తెలంగాణ ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా జనసేన జెండాను తెలంగాణ గడ్డపై ఎగురవేయడమే తమ లక్ష్యమని తెలిపారు. ఇందుకోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారని అన్నారు.ప్రజా సమస్యలపై పోరాటాలను మరింత ఉధృతం చేస్తామని, ప్రజల తరఫున జనసేన పార్టీ నిరంతరం గళమెత్తుతుందని కరాటే ప్రభాకర్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీకి చెందిన పలువురు స్థానిక నాయకులు, కార్యకర్తలు, మద్దతుదారులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ మద్దతు తెలిపారు.

42వ డివిజన్‌లో SIR అన్‌మ్యాపింగ్, తప్పొప్పుల సవరణ కార్యక్రమం



వరంగల్, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : వరంగల్ నగరంలోని 42వ డివిజన్ పరిధిలో SIR అన్‌మ్యాపింగ్, ఓటర్ల వివరాల్లోని తప్పొప్పులను సరిదిద్దే కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. స్థానిక రంగశాయిపేటలోని లిటిల్ ఫ్లవర్ పాఠశాలలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి 208, 213 బూత్‌లకు చెందిన సుమారు 300 మంది ఓటర్లు హాజరై తమ సందేహాలను నివృత్తి చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో SIR వరంగల్ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ శేర్ల అనిల్ కుమార్, మున్సిపల్ AERO రవీంద్రనాథ్, BLOలు బజ్జూరి లావణ్య, జ్యోతి రాణి, కిలా వరంగల్ ఆర్ఐ వరుణ్ తదితరులు పాల్గొన్నారు. ఓటర్లకు సంబంధించిన వివరాలను పరిశీలించి, అన్‌మ్యాపింగ్, తప్పొప్పుల సవరణపై అవసరమైన ప్రక్రియను నిర్వహించారు. ప్రజలకు అవసరమైన సమాచారం, సూచనలు అందించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ తరఫున SIR వరంగల్ జిల్లా లీగల్ సెల్ కన్వీనర్ శేర్ల అనిల్ కుమార్ మాట్లాడుతూ.. ప్రజలకు సంబంధించిన సమస్యలు, అంశాల పరిష్కారానికి ఇటువంటి కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయని అన్నారు. ఓటర్లు తమ సమస్యలను సరైన విధానంలో సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్తే త్వరితగతిన పరిష్కారం పొందే అవకాశం ఉంటుందని తెలిపారు. SIR ప్రక్రియలో ప్రజలు అప్రమత్తంగా ఉండి, తమ ఓటరు వివరాలను సరిచూసుకోవాలని సూచించారు.

దామెర విద్యుత్ సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలి





ఎల్కతుర్తి, సెప్టెంబర్ 9 (నిత్యం నిఘా ప్రతినిధి) : ఎల్కతుర్తి మండలం దామెర గ్రామంలో నెలకొన్న విద్యుత్ సమస్యకు తక్షణమే శాశ్వత పరిష్కారం చూపాలని బీజేపీ ఎల్కతుర్తి మండల అధ్యక్షుడు మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ డిమాండ్ చేశారు. గ్రామానికి ప్రస్తుతం అందుతున్న 33కేవీ విద్యుత్ సరఫరాకు ప్రత్యామ్నాయ (ఆల్టర్నేట్) లైన్ లేకపోవడంతో చిన్న సాంకేతిక సమస్య తలెత్తినా విద్యుత్ సరఫరా పూర్తిగా నిలిచిపోతుందని తెలిపారు.తరచూ విద్యుత్ అంతరాయాలు ఏర్పడటంతో గ్రామంలో తాగునీటి సరఫరా, విద్యార్థుల చదువులు, వ్యాపారాలు, ప్రజల రోజువారీ కార్యకలాపాలు తీవ్రంగా ప్రభావితమవుతున్నాయని పేర్కొన్నారు. ముఖ్యంగా రైతులకు 3-ఫేజ్ విద్యుత్ సక్రమంగా అందకపోవడంతో పంటలకు నీరు అందించలేక ఇబ్బందులు పడుతున్నారని, పంటలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడటంతో రైతులు ఆందోళన చెందుతున్నారని తెలిపారు. ఈ సమస్యలపై విద్యుత్ శాఖ SE, ADE, AE అధికారులకు వినతిపత్రం అందజేసినట్లు శ్రీకాంత్ యాదవ్ తెలిపారు. దామెర గ్రామానికి 33కేవీ ఆల్టర్నేట్ లైన్ ఏర్పాటు చేయడంతో పాటు రైతులకు 3-ఫేజ్ విద్యుత్ నిరంతరాయంగా అందేలా చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినట్లు చెప్పారు. అధికారులు వెంటనే స్పందించి 33కేవీ ఆల్టర్నేట్ లైన్ ఏర్పాటుకు సర్వే, అంచనాలు పూర్తి చేసి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ విద్యుత్ సరఫరాలో తరచూ ఏర్పడుతున్న అంతరాయాలను నివారించి రైతులకు సక్రమంగా విద్యుత్ అందేలా చూడాలని కోరారు. రైతుల పంటలు ఎండిపోయిన తర్వాత స్పందించడం కాకుండా ఇప్పుడే చర్యలు చేపట్టి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని మంతుర్తి శ్రీకాంత్ యాదవ్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యవర్గ సభ్యుడు పల్లెపాటి మాధవరావు, ప్రధాన కార్యదర్శులు చిరురాల వెంకటేష్, అల్లి కుమార్, కార్యదర్శి కోడం రమేష్, జిల్లా కిసాన్ మోర్చా కార్యవర్గ సభ్యుడు తక్కలపల్లి సంపత్ రావు, సీనియర్ నాయకులు కంచర్ల శంకరయ్య, జనానికి ష్టయ్య, అడెపు శ్రీ వర్ధన్, సల్వాల కిరణ్, ఠాకూర్ శాంసింగ్, చీరాల రంజిత్, మాధవరావు తదితర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలే లక్ష్యం



ఎల్కతుర్తి, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : విద్యార్థుల్లో ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలు, బాధ్యతాయుత నిర్ణయాలు తీసుకునే నైపుణ్యాలను పెంపొందించేందుకు సెయింట్ థామస్ అల్టిట్యూడ్ హైస్కూల్‌లో నమూనా ఎన్నికలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ప్రధాన విద్యార్థి నాయకుడు, సహాయ ప్రధాన విద్యార్థి నాయకుడు, క్రీడా విభాగం ప్రతినిధుల ఎంపిక కోసం ఎన్నికల ప్రక్రియను నిర్వహించారు. ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు తమ లక్ష్యాలు, ఆలోచనలు, భవిష్యత్ కార్యాచరణను తోటి విద్యార్థులకు వివరించి ఓట్లు అభ్యర్థించారు. అనంతరం విద్యార్థులు తమకు నచ్చిన అభ్యర్థులకు ఓటు వేసి, ఓటు హక్కు వినియోగం, నాయకుల ఎంపిక, ప్రజాస్వామ్య ఎన్నికల ప్రక్రియపై ప్రత్యక్ష అవగాహన పొందారు.ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ పుస్కూరి కార్తీక్ రావు మాట్లాడుతూ.. విద్యార్థులకు బాల్యం నుంచే ప్రజాస్వామ్య విలువలు, నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పించడం ఎంతో అవసరమన్నారు. ఇలాంటి కార్యక్రమాల ద్వారా విద్యార్థుల్లో ఆత్మ విశ్వాసం, క్రమశిక్షణ, బాధ్యత, సమిష్టి భావన, నిర్ణయాత్మకత వంటి లక్షణాలు పెంపొందుతాయని తెలిపారు.ఎన్నికల ప్రక్రియలో విద్యార్థులు ప్రత్యక్షంగా పాల్గొనడం ద్వారా నాయకత్వ బాధ్యతలతో పాటు తమ హక్కులు, బాధ్యతలపై అవగాహన పెంచుకోవచ్చని పేర్కొన్నారు. భవిష్యత్‌లో సమాజానికి బాధ్యతాయుతమైన పౌరులుగా ఎదగడానికి ఇలాంటి కార్యక్రమాలు ఎంతగానో దోహదపడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ మర్రి అశోక్, వైస్ ప్రిన్సిపాల్ లింగం మొగిలి, వ్యాయామ ఉపాధ్యాయుడు కర్రె తిరుపతితో పాటు ఉపాధ్యాయులు సరిత, లావణ్య, ఆశా బేగం, సురేష్, రమేష్, కృష్ణ, మమత, కవిత, లలిత తదితరులు పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించారు.

మైదానంలో సత్తా చాటిన విద్యార్థులు



ఎల్కతుర్తి, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : ఎల్కతుర్తి మండల కేంద్రంలోని కార్మెల్ కాన్వెంట్ హైస్కూల్‌లో 70వ మండల స్థాయి పాఠశాల క్రీడా సమాఖ్య (ఎస్‌జీఎఫ్) క్రీడా ఎంపికలు బుధవారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ క్రీడా ప్రతిభను ప్రదర్శించారు. ఈ ఎంపికల్లో ఖో-ఖో, వాలీబాల్, కబడ్డీ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహించారు. వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్సాహంగా పోటీల్లో పాల్గొని క్రీడా స్ఫూర్తిని చాటారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను తదుపరి స్థాయి జిల్లా క్రీడా ఎంపికలకు ఎంపిక చేశారు. ఈ సందర్భంగా మండల విద్యాధికారి చదువుల సత్యనారాయణ మాట్లాడుతూ.. విద్యార్థులకు చదువుతో పాటు క్రీడలు కూడా ఎంతో అవసరమన్నారు. క్రీడల ద్వారా విద్యార్థుల్లో క్రమశిక్షణ, పట్టుదల, ఆత్మ విశ్వాసం, నాయకత్వ లక్షణాలు, సమిష్టి భావన పెంపొందుతాయని తెలిపారు. చిన్ననాటి నుంచే క్రీడలపై ఆసక్తి పెంచుకుని నిరంతరం సాధన చేయాలని సూచించారు. క్రీడల్లో రాణించడం ద్వారా మండల, జిల్లా స్థాయి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయికి ఎదిగే అవకాశాలు ఉన్నాయని అన్నారు. విద్యార్థులు గెలుపోటములను సమానంగా స్వీకరించి, ఓటమి నుంచి పాఠాలు నేర్చుకుని మరింత పట్టుదలతో ముందుకు సాగాలని సూచించారు. క్రీడలు విద్యార్థుల శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక వికాసానికి కూడా దోహదపడతాయని పేర్కొన్నారు. ఎల్కతుర్తి మండలానికి మంచి పేరు తీసుకువచ్చేలా విద్యార్థులు ప్రతిభ కనబరచాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎల్కతుర్తి సర్పంచ్ మునిగడప లావణ్య శేషు, ఉపసర్పంచ్ గుడిశాల రాజు హాజరయ్యారు. గౌరవ అతిథులుగా విజయ్‌కుమార్, ఎంపీడీవో బి. కిషన్‌రావు, గోపాల్‌పూర్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు టీసీ తెరిస్, కార్మెల్ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం. ధనలక్ష్మి , హెచ్‌సీఎఫ్ కార్యదర్శి టి. రాములు పాల్గొన్నారు. అలాగే సుధాకర్, ప్రేమ్ ప్రసాద్, స్వరూప, ప్రభావతి, శ్రీకాంత్, ఉదయ్, తిరుపతి, పూర్ణిమ, ఉషారాణి, కిరణ్‌రావు తదితర వ్యాయామ ఉపాధ్యాయులు, ఉపాధ్యాయినులు పాల్గొని క్రీడా ఎంపికలను విజయవంతంగా నిర్వహించారు. ఎంపికైన విద్యార్థులను అభినందిస్తూ తదుపరి స్థాయి పోటీల్లో మరింత ప్రతిభ కనబరిచి విజయాలు సాధించాలని ఆకాంక్షించారు.

Nityam Nigha 10.09.26_Layout 1 9/10/2026 6:34 AM Page 5

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

మూలిగే నక్కపై తాటిపండు పడినట్లు... విలేకరి బతుకు !

నిత్యం నిఘా స్పెషల్,సెప్టెంబర్ 09 : సమాజంలో ఏదైనా సంఘటన జరిగినప్పుడు దాన్ని ప్రజలకు తెలియజేయడానికి అక్కడ ఎవరో ఒకరు ఉండాలి. ప్రమాదం జరిగిన ప్రదేశంలో కెమెరాతో కనిపించే వ్యక్తి విలేకరి. ప్రజల సమస్యల మధ్య నిలబడే వ్యక్తి విలేకరి. అధికారుల కార్యాలయాల చుట్టూ తిరుగుతూ సమాధానాలు రాబట్టే వ్యక్తి విలేకరి. ఒక గ్రామంలో తలెత్తిన చిన్న సమస్యను జిల్లా స్థాయి చర్చగా మార్చగలిగే శక్తి కూడా స్థానిక విలేకరికే ఉంటుంది. ఇతరుల జీవితాల్లో వెలుగును వెతికే విలేకరి.. తన ఇంట్లో వెలుగు నింపుకోవడానికి మాత్రం చాలాసార్లు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాడు. ఇదే నేటి స్థానిక జర్నలిజం ఎదుర్కొంటున్న నిశ్శబ్ద విషాదం.విలేకరి ఉదయం బయటకు అడుగుపెట్టినప్పటి నుంచి అతని వెంట ఖర్చులు కూడా నడుస్తాయి. బైక్‌కు పెట్రోల్ కావాలి. ఫోన్‌కు రీచార్జ్ కావాలి. ఇంటర్నెట్ డేటా కావాలి. సంఘటన జరిగిన ప్రదేశానికి చేరుకోవడానికి ప్రయాణ ఖర్చు కావాలి. వార్త రాయడానికి సమయం కావాలి. ఫొటోలు, వీడియోలు పంపడానికి సాంకేతిక సదుపాయాలు కావాలి.ఇవన్నీ వృత్తిలో భాగమే. కానీ ఆ వృత్తి నుంచి వచ్చే ఆదాయం మాత్రం చాలాసార్లు అతని జీవితంలో భాగం కావడం లేదు. ఇక్కడే జర్నలిజం యొక్క ఒక చేదు వాస్తవం కనిపిస్తుంది.వార్తకు విలువ ఉంటుంది.. వార్తను సేకరించే మనిషి శ్రమకు మాత్రం విలువ తగ్గిపోతుంది.విలేకరి శ్రమ కనిపించదు.. వార్త మాత్రమే కనిపిస్తుంది.పత్రికలో ఒక వార్త ప్రచురితమవుతుంది. పాఠకుడు దాన్ని చదివి ముందుకు వెళ్తాడు. కానీ ఆ వార్త వెనుక ఉన్న ప్రయాణం మాత్రం చాలామందికి కనిపించదు.వెలుతురు రాకముందే బయలుదేరిన బైక్ కనిపించదు. ఎండలో తిరిగిన గంటలు కనిపించవు. వర్షంలో తడిసిన కెమెరా కనిపించదు. అధికారిని కలవడానికి ఎదురుచూసిన సమయం కనిపించదు. ఒక సమస్యను నిర్ధారించడానికి చేసిన ఫోన్ కాల్స్ కనిపించవు. చివరకు కనిపించేది ఒక్కటే—వార్త.ఆ వార్త వెనుక ఉన్న మనిషి మాత్రం కనిపించకుండా పోతున్నాడు. ఇది కేవలం విలేకరి సమస్య కాదు. జర్నలిజం విలువను మనం ఎలా అర్థం చేసుకుంటున్నామన్న దానికి ఇది ప్రతిబింబం.డిజిటల్ మీడియా విస్తరించింది.. కానీ విలేకరి జీవితం విస్తరించలేదు కాలం మారింది. ప్రింట్ మీడియాతో పాటు డిజిటల్ మీడియా వచ్చింది. వెబ్‌సైట్లు, ఈ-పేపర్లు, పీడీఎఫ్ పత్రికలు, సోషల్ మీడియా వేదికలు వార్తా ప్రపంచాన్ని విస్తరించాయి. ఒక వార్త క్షణాల్లో వేలాది మందికి చేరుతోంది.మీడియా విస్తరణ వేగంగా జరిగింది. కానీ ఆ విస్తరణకు అనుగుణంగా విలేకరి ఆర్థిక భద్రత మాత్రం పెరగలేదు.కొన్ని చోట్ల రిపోర్టర్‌గా పనిచేయాలంటే ఐడీ కార్డు, రిజిస్ట్రేషన్ లేదా ఇతర పేర్లతో రుసుములు చెల్లించాల్సిన పరిస్థితులు కూడా కనిపిస్తున్నాయి. ఇలాంటి విధానాలు ఎక్కడైనా ఉంటే వాటి వెనుక పూర్తి పారదర్శకత అవసరం.రిపోర్టర్ సంస్థ కోసం పనిచేస్తున్నాడా? లేక సంస్థే రిపోర్టర్ ద్వారా తన వ్యాపారాన్ని కొనసాగిస్తుందా? అనే తేడా స్పష్టంగా ఉండాలి.ఐడీ కార్డు వృత్తికి గుర్తింపు కావచ్చు.. జీవనోపాధికి కాదుమెడలో వేలాడే ఐడీ కార్డు విలేకరి వృత్తిపరమైన గుర్తింపును తెలియజేయవచ్చు. కానీ అది కుటుంబాన్ని పోషించదు.ఐడీ కార్డు పిల్లల స్కూల్ ఫీజు చెల్లించదు. ఇంటి అద్దె కట్టదు. బైక్‌లో పెట్రోల్ పోయదు. మొబైల్ రీచార్జ్ చేయదు.అందుకే విలేకరి గురించి మాట్లాడేటప్పుడు కేవలం గుర్తింపు, గౌరవం, హోదా అనే పదాలతో సరిపెట్టడం కాలం చెల్లిన ఆలోచన. వృత్తికి గౌరవం ఎంత అవసరమో.. వృత్తి చేసే వ్యక్తికి జీవనోపాధి కూడా అంతే అవసరం.జర్నలిజాన్ని బలంగా ఉంచాలంటే విలేకరిని బలహీనంగా ఉంచే వ్యవస్థ కొనసాగకూడదు. "సేవ" అనే పదం వెనుక దాగిపోతున్న ఆర్థిక వాస్తవంవిలేకరి సేవ చేస్తున్నాడు. అది నిజమే. ప్రజల కోసం పని చేస్తున్నాడు. అదీ నిజమే. కానీ సేవ చేస్తున్నాడనే కారణంతో అతని శ్రమకు విలువ ఉండకూడదనేది మాత్రం నిజం కాదు.విలేకరి తన సమయాన్ని ఇస్తున్నాడు. తన వాహనాన్ని ఉపయోగిస్తున్నాడు. తన ఫోన్, డేటా, కెమెరా వంటి వనరులను వినియోగిస్తున్నాడు. అవసరమైన సందర్భాల్లో తన భద్రతను కూడా పణంగా పెడుతున్నాడు. అతను అందిస్తున్నది కేవలం ఒక వార్త కాదు—తన సమయం, శ్రమ, వనరులు.అందుకే రిపోర్టర్‌ను ఆదాయ వనరుగా కాకుండా వృత్తిపరమైన భాగస్వామిగా చూడాలి. ఆరోగ్యకరమైన మీడియా వ్యవస్థలో విలేకరి సంస్థకు భారం కాదు.. అతనే సంస్థకు బలం.గ్రామం నుంచి జిల్లా కేంద్రానికి వార్తను తీసుకువచ్చే వారధి అతనే. ప్రజలకు, మీడియా సంస్థకు మధ్య ప్రత్యక్ష సంబంధం కల్పించే వ్యక్తి కూడా అతనే.అలాంటి వ్యక్తికి కేవలం ఐడీ కార్డు ఇచ్చి పంపించడం జర్నలిజం వ్యవస్థను బలపరచదు.విలేకరి శ్రమకు తగిన పారితోషికం, కంటెంట్‌కు విలువ, వృత్తిపరమైన శిక్షణ, అవసరమైన సందర్భాల్లో రక్షణ వంటి అంశాలపై మీడియా సంస్థలు ఆలోచించాల్సిన అవసరం ఉంది.అదే సమయంలో విలేకరి కూడా తన వృత్తిపరమైన బాధ్యతను అర్థం చేసుకోవాలి.గుర్తింపు కార్డు కంటే నైతికత ముఖ్యం.హోదా కంటే వాస్తవ నిర్ధారణ ముఖ్యం.అధికారం కంటే ప్రజా ప్రయోజనం ముఖ్యం.విలేకరికి హక్కులు కావాలి. అదే సమయంలో బాధ్యత కూడా కావాలి.స్థానిక జర్నలిజం బలహీనపడితే.. ప్రజల గొంతుక బలహీనపడుతుందిఒక పెద్ద నగరంలోని సంఘటనకు జాతీయ మీడియా దృష్టి పడవచ్చు. కానీ ఒక చిన్న గ్రామంలోని సమస్యను మొదట గుర్తించేది స్థానిక విలేకరే.ఒక పాఠశాలలో మరుగుదొడ్లు లేకపోవడం నుంచి ఒక గ్రామానికి రోడ్డు లేకపోవడం వరకు.. ఒక వృద్ధుడికి పింఛన్ రాకపోవడం నుంచి ప్రభుత్వ కార్యాలయంలో ప్రజలు ఎదుర్కొనే ఇబ్బందుల వరకు.. ఇవే ప్రజల అసలు జీవితం.వాటిని వెలుగులోకి తెచ్చే స్థానిక జర్నలిజం బలహీనపడితే ప్రజల సమస్యలకు ఒక ముఖ్యమైన వేదిక మూసుకుపోతుంది. అందుకే విలేకరి జీవనోపాధి గురించి మాట్లాడటం కేవలం ఒక వ్యక్తిగత సమస్య గురించి మాట్లాడటం కాదు. ప్రజల గొంతుకగా నిలిచే వ్యవస్థను కాపాడుకోవడం. రుసుములు ఉంటే.. పారదర్శకత తప్పనిసరి"విలేకరి కదా.. సేవ చేస్తాడు" అనే ఒక్క మాట స్థానిక జర్నలిజంపై ఎన్నో సంవత్సరాలుగా మోపబడిన అదృశ్య భారంగా మారింది.సేవ చేయడం విలేకరి గౌరవం. కానీ ఆ సేవను ఉపయోగించుకునే వ్యవస్థ అతని శ్రమను గౌరవించడం కూడా బాధ్యతగా తీసుకోవాలి.రిపోర్టర్ నుంచి రుసుము తీసుకోవడం తప్పనిసరి అయితే దాని వెనుక పూర్తి పారదర్శకత ఉండాలి. సంస్థ అందించే సేవలు స్పష్టంగా ఉండాలి. ఆర్థిక లావాదేవీలకు రసీదులు ఉండాలి. బాధ్యతలు, హక్కులు, ఆదాయ మార్గాలు ముందుగానే స్పష్టంగా ఉండాలి.లేకపోతే జర్నలిజం పేరుతో ఏర్పడిన వ్యవస్థలో వార్త కంటే రుసుమే ప్రధానంగా మారే ప్రమాదం ఉంటుంది. అది జర్నలిజానికి మంచిది కాదు.తన సమస్యను మాత్రం రాయలేని విలేకరివిలేకరి రోజూ ఇతరుల సమస్యలను రాస్తాడు.ఎవరి ఇంటికి నీరు రాలేదో రాస్తాడు.ఎవరి రోడ్డు పాడైందో రాస్తాడు.ఎవరి పింఛన్ ఆగిపోయిందో రాస్తాడు.ఎక్కడ అన్యాయం జరిగిందో రాస్తాడు.కానీ తన సమ-స్యను మాత్రం చాలాసార్లు రాయలేడు.ఎందుకంటే అతని చేతిలో ఉన్న కలం ప్రజల కోసం. అతని జీవితంలో మాత్రం ఒక నిశ్శబ్ద పోరాటం కొనసాగుతూనే ఉంటుంది.వార్త కోసం పరుగెత్తే కాళ్లకు పెట్రోల్ కావాలి. వార్త రాసే చేతికి జీవనోపాధి కావాలి. ప్రజల గొంతుకగా నిలిచే వ్యక్తికి తన కుటుంబం ముందు గౌరవంగా నిలబడే స్థోమత కావాలి.ఇది విలేకరికి ఇచ్చే దానం కాదు.. అతని శ్రమకు ఇవ్వాల్సిన విలువ.ఇప్పటికే ఆదాయం లేక ఇబ్బందులు పడుతున్న స్థానిక విలేకరిపై మరో రుసుము, మరో చార్జీ, మరో భారం పడితే అది నిజంగానే..."మూలిగే నక్కపై తాటిపండు పడినట్లే!"జర్నలిజం బతకాలంటే కేవలం పత్రికలు, వెబ్‌సైట్లు, యాప్‌లు బతకడం సరిపోదు. వాటిని ప్రజల మధ్య నిలబెట్టే విలేకరి కూడా బతకాలి.ఎందుకంటే..."వార్తకు ప్రాణం ప్రజలు అయితే.. ఆ వార్తకు ఊపిరి విలేకరి."ఆ ఊపిరే ఆర్థిక భారంతో ఆగిపోకుండా చూడటం మీడియా సంస్థలు, సమాజం, సంబంధిత వర్గాల సమిష్టి బాధ్యత.



నిరుపేదలకు వైద్య భరోసా



వరంగల్/వర్ధన్నపేట, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : అనారోగ్యంతో వైద్య చికిత్సకు ఇబ్బందులు పడుతున్న నిరుపేద కుటుంబాలకు వర్ధన్నపేట ఎమ్మెల్యే, విశ్రాంత ఐపీఎస్ అధికారి కేఆర్ నాగరాజు అండగా నిలిచారు. ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా మంజూరైన రూ.5.50 లక్షల విలువైన ఎల్ఓసీ ఆర్థిక సహాయాన్ని బాధిత కుటుంబాలకు అందజేశారు. వర్ధన్నపేట మండలం గుబ్బేట తండాకు చెందిన బానోత్ వెంకటరామ్ నాయక్ హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, వైద్య ఖర్చుల కోసం రూ.3 లక్షల ఎల్ఓసీ మంజూరైంది. అదేవిధంగా దమ్మన్నపేట గ్రామానికి చెందిన అంగడి నర్సమ్మకు రూ.2.50 లక్షల ఆర్థిక సహాయం మంజూరు చేయించారు. హైదరాబాద్‌లోని ఎమ్మెల్యే కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు ఎల్ఓసీ పత్రాలను ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేదల వైద్య చికిత్సకు ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ప్రభుత్వం అండగా నిలుస్తోందన్నారు. ఆపదలో ఉన్న నిరుపేదలకు తనవంతు సహాయ సహకారాలు ఎల్లప్పుడూ అందిస్తానని హామీ ఇచ్చారు. వైద్య ఖర్చుల భారంతో ఇబ్బందులు పడుతున్న తమ కుటుంబాలకు ఆర్థిక సహాయం అందేలా కృషి చేసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజుకు, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి, ప్రభుత్వానికి బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో వర్ధన్నపేట మున్సిపాలిటీ 4, 5వ వార్డులకు చెందిన నాయకులు కీమా నాయక్, రాజేందర్, మైబు, భిక్షపతి తదితరులు పాల్గొన్నారు.

ప్రజాకవి కాళోజీ జీవితం ఆదర్శనీయం



హనుమకొండ, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : ప్రజాకవి కాళోజీ నారాయణరావు తన కలం ద్వారా ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చారని, ఆయన జీవితం నేటి తరానికి ఆదర్శనీయమని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. కాళోజీ జయంతిని పురస్కరించుకుని బుధవారం హనుమకొండ నక్కలగుట్టలోని కాళోజీ విగ్రహానికి ఎంపీ డాక్టర్ కడియం కావ్య, జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్, అదనపు కలెక్టర్ ఎన్. రవి, కేంద్ర సాహిత్య అకాడమీ పురస్కార గ్రహీత అంపశయ్య నవీన్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎంపీ కడియం కావ్య మాట్లాడుతూ.. కాళోజీ జయంతిని పురస్కరించుకుని తెలంగాణ భాషా దినోత్సవాన్ని నిర్వహించుకోవడం ఎంతో సంతోషకరమన్నారు. ప్రజల సమస్యలు, ఇబ్బందులను తన రచనల ద్వారా ఎప్పటికప్పుడు ప్రజల ముందుకు తీసుకెళ్లి వారిలో చైతన్యం నింపిన కాళోజీ నేటి తరానికి ఆదర్శప్రాయుడని పేర్కొన్నారు. తెలంగాణ సాధన ఉద్యమంలో కాళోజీ సాహిత్య స్ఫూర్తి, ఆయన రచనలు ప్రజల్లో గొప్ప చైతన్యాన్ని నింపాయని అన్నారు. కాళోజీ వరంగల్‌కు చెందినవారు కావడం ఈ ప్రాంత ప్రజలకు గర్వకారణమని తెలిపారు. కాళోజీ రచనలు, సాహిత్యాన్ని ప్రతి ఒక్కరూ చదవాలని, ముఖ్యంగా యువత ఆయన ఆలోచనా విధానాన్ని స్ఫూర్తిగా తీసుకోవాలని కోరారు.ప్రజాకవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ప్రజలందరికీ ఎంపీ కడియం కావ్య శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పలువురు కాళోజీ ఆశయాలను కొనసాగిస్తామని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్ శేషాద్రి, కాళోజీ ఫౌండేషన్ అధ్యక్షుడు నాగిళ్ల రామశాస్త్రి, కార్యదర్శి వీఆర్ విద్యార్థి, కోశాధికారి పందిళ్ల అశోక్ కుమార్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ ఆగపాటి రాజ్ కుమార్, సంయుక్త కార్యదర్శి పొట్లపల్లి శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ సొసైటీ రాష్ట్ర పాలక మండలి సభ్యులు ఈ.వి. శ్రీనివాసరావు, హనుమకొండ తహసీల్దార్ రవీందర్ రెడ్డి, ఇతర అధికారులు, కవులు, కళాకారులు పాల్గొన్నారు.

కాళోజీ కళాక్షేత్రంలో నివాళులు

కాళోజీ జయంతిని పురస్కరించుకుని హనుమకొండ బాలసముద్రంలోని కాళోజీ కళాక్షేత్రంలో కాళోజీ నారాయణరావు విగ్రహానికి జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్ పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో కుడా సీపీవో అజిత్ రెడ్డి, ఈఈ భీమ్ రావు తదితరులు పాల్గొన్నారు.

గణేష్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలి

హన్మకొండ/ ఎల్కతుర్తి, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని ఎల్కతుర్తి సీఐ కొండ్రు శ్రీనివాస్, ఎస్సై నరసింహారావు సూచించారు. ఈ మేరకు ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ పరిధిలోని గణేష్ ఉత్సవాల ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులతో బుధవారం సీఐ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ కొండ్రు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ఉత్సవాలను శాంతియుతంగా, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావులేకుండా నిర్వహించేందుకు నిర్వాహకులు పోలీసు శాఖకు సహకరించాలని కోరారు. గణేష్ మండపాల వద్ద భద్రతా చర్యలు చేపట్టడంతో పాటు విద్యుత్ ప్రమాదాలకు అవకాశం లేకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఉత్సవాల సమయంలో ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలని, ఊరేగింపులు, నిమజ్జన కార్యక్రమాలను పోలీసుల సూచనలు, నిబంధనలకు అనుగుణంగా నిర్వహించాలని తెలిపారు. ఎస్సై నరసింహారావు మాట్లాడుతూ.. గణేష్ మండపాల వద్ద నిర్వాహకులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. డీజేలు, లౌడ్‌స్పీకర్ల వినియోగంలో ప్రభుత్వ నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, ఇతరులకు ఇబ్బంది కలిగించే విధంగా శబ్ద కాలుష్యానికి పాల్పడరాదని తెలిపారు. నిమజ్జనం సందర్భంగా ప్రజలు, భక్తులు, ముఖ్యంగా యువత బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కోరారు. మండపాల వద్ద ఎలాంటి సమస్యలు తలెత్తినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. గణేష్ ఉత్సవాలు సోదర భావం, భక్తి, ఆనందోత్సాహాల మధ్య విజయవంతంగా జరిగేలా ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. సమావేశంలో ఎల్కతుర్తి పోలీస్ స్టేషన్ సిబ్బంది, పోలీస్ స్టేషన్ పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన గణేష్ ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



Nityam Nigha 10.09.26_Layout 1 9/10/2026 6:34 AM Page 6

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

కాళోజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలి



ములుగు జిల్లా/ మల్లంపల్లి , సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : ప్రజాకవి కాళోజీ నారాయణరావు ఆశయాలను నేటి యువత ముందుకు తీసుకెళ్లాలని మల్లంపల్లి మండల సాధన సమితి అధ్యక్షుడు గోల్కొండ రాజు పిలుపునిచ్చారు. కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాళోజీ జీవితం, సాహిత్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకమని అన్నారు.తెలంగాణ ప్రజల సమస్యలను తన రచనలు, కవితల ద్వారా సమాజం దృష్టికి తీసుకువచ్చిన గొప్ప ప్రజాకవి కాళోజీ అని కొనియాడారు. సామాన్య ప్రజల పక్షాన నిలిచి, అన్యాయం, అక్రమాలు, అణచివేతకు వ్యతిరేకంగా తన కలాన్ని అక్షరాయుధంగా మలిచారని పేర్కొన్నారు. తెలంగాణ భాష, యాస, సంస్కృతిపై కాళోజీకి ఉన్న అభిమానం ప్రతి ఒక్కరికీ ఆదర్శమని గోల్కొండ రాజు అన్నారు. ఆయన జయంతిని తెలంగాణ భాషా దినోత్సవంగా నిర్వహించడం సముచిత గౌరవమని తెలిపారు. మల్లంపల్లి ప్రాంత ప్రజల హక్కులు, అభివృద్ధి కోసం ప్రజా ఉద్యమాల ద్వారా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాల్సిన అవసరం ఉందన్నారు. కాళోజీ స్ఫూర్తితో ప్రజా సమస్యలపై ప్రశ్నిస్తూ, ప్రజా ప్రయోజనాల కోసం ఐక్యంగా ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. కాళోజీ చూపిన ప్రజా చైతన్య మార్గాన్ని నేటి తరం ఆదర్శంగా తీసుకుని, సమాజంలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని గోల్కొండ రాజు కోరారు.

చర్లలో ఘనంగా మండల ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలు



భద్రాద్రి కొత్తగూడెం జిల్లా/ చర్ల, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి): సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని, విద్యార్థుల భవిష్యత్‌ను తీర్చిదిద్దడంలో వారు చేస్తున్న సేవలు చిరస్మరణీయమని మండల విద్యాశాఖ అధికారులు కొనియాడారు. చర్ల మండల కేంద్రంలోని రైతు వేదిక ప్రాంగణంలో బుధవారం మండల ఉపాధ్యాయ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమం ప్రారంభంలో భారత మాజీ రాష్ట్రపతి, ప్రముఖ తత్వవేత్త డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల పరిధిలోని వివిధ పాఠశాలల్లో ఉత్తమ సేవలు అందించిన 30 మంది ఉపాధ్యాయులు, విద్యాశాఖ సిబ్బందిని ఘనంగా సన్మానించారు. శాలువాలు కప్పి, పూలమాలలు వేసి సత్కరించడంతో పాటు ప్రశంసా పత్రాలు, బహుమతులను అందజేశారు. విభాగాల వారీగా సన్మానితుల వివరాలు:

- ★ హైస్కూల్ విభాగం – 11 మంది
- ★ ప్రాథమిక, ప్రాథమికోన్నత (పీఎస్/యూపీఎస్) విభాగం – 12 మంది
- ★ ఎల్ఎఫ్ఎల్ ప్రధానోపాధ్యాయుల విభాగం – 4 గురు
- ★ సీఆర్పీ, ఎంఆర్సీ సిబ్బంది – 3 గురు

మొత్తం – 30 మంది, ఈ వేడుకలకు మండలంలోని వివిధ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘాల నాయకులు, ప్రజాప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. విద్యారంగ అభివృద్ధికి, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు ఉపాధ్యాయులు చేస్తున్న నిస్వార్థ కృషిని పలువురు వక్తలు ప్రశంసించారు. సన్మానం పొందిన ఉపాధ్యాయులకు అధికారులు, తోటి ఉపాధ్యాయులు ప్రత్యేక శుభాకాంక్షలు తెలిపారు.

మేడారంలో సమ్మక్క - సారలమ్మలను దర్శించుకున్న అన్వేష్ రెడ్డి



ములుగు జిల్లా / మేడారం, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : మేడారంలోని వనదేవతలు సమ్మక్క–సారలమ్మ తల్లులను సీడ్ కార్పొరేషన్ మాజీ రాష్ట్ర చైర్మన్, టీపీసీసీ కిసాన్ సెల్ రాష్ట్ర అధ్యక్షులు అన్వేష్ రెడ్డి బుధవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవార్లకు మొక్కులు చెల్లించి ఆశీర్వాదం పొందారు. అనంతరం సమ్మక్క పూజారి సిద్ధబోయిన రానా రమేష్ అన్వేష్ రెడ్డికి కండువా కప్పి సత్కరించి, అమ్మవారి ప్రసాదాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో సీతక్క యువసేన జిల్లా అధ్యక్షులు చెర్ప రవీందర్‌తో పాటు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సాఫ్ట్‌బాల్‌లో సత్తా చాటిన ల్యాబర్తి విద్యార్థి



వరంగల్ / వర్ధన్నపేట, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : క్రీడా ప్రతిభకు పేదరికం, గ్రామీణ నేపథ్యం అడ్డంకి కాదని నిరూపిస్తూ ల్యాబర్తి ఉన్నత పాఠశాల విద్యార్థి ఫంకు యశ్వంత్ సాఫ్ట్‌బాల్‌లో సత్తా చాటాడు. వరంగల్ ఓసిటీ క్రీడా మైదానంలో ఈ నెల 3న నిర్వహించిన జిల్లా స్థాయి సాఫ్ట్‌బాల్ సబ్‌జూనియర్ (14 సంవత్సరాల విభాగం) ఎంపిక పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యాడు. ల్యాబర్తి ఉన్నత పాఠశాలలో 8వ తరగతి చదువుతున్న యశ్వంత్ తన అద్భుతమైన ఆటతీరుతో జిల్లా స్థాయి ఎంపిక కమిటీ దృష్టిని ఆకర్షించాడు. దీంతో ఈ నెల 13, 14, 15 తేదీల్లో బెల్లంపల్లిలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీల్లో వరంగల్ జిల్లా తరఫున ప్రాతినిధ్యం వహించే అవకాశం దక్కింది. యశ్వంత్ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక కావడంపై పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు లింగం శైలజ, వ్యాయామ ఉపాధ్యాయుడు జలగం రఘువీర్ హర్షం వ్యక్తం చేశారు. క్రమశిక్షణతో నిరంతరం సాధన చేస్తే భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించగలడని పేర్కొన్నారు. రాష్ట్రస్థాయికి ఎంపికైన యశ్వంత్‌ను గ్రామ సర్పంచ్ మన్నూరు శారద సోము, ఉపసర్పంచ్ సంకినేని గంగరాజు, పాఠశాల అమ్మ ఆదర్శ కమిటీ సభ్యురాలు పబ్బోజు సునీత, వరంగల్ జిల్లా సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పూజారి అశోక్ బాబు, గ్రామ కార్యదర్శి శ్రీకర్, కరోబార్ భాస్కర్, పాఠశాల ఉపాధ్యాయులు వేణుకుమార్, మాధురి, వెంకటస్వామి, నాగరాజు, హరిలాల్, శివ కుమార్, యుగేందర్, వెంకటేశ్వర్లు, ప్రభాకర్, వ్యాయామ ఉపాధ్యాయుడు రఘువీర్ తదితరులు అభినందించారు. రాష్ట్రస్థాయి పోటీల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచి ల్యాబర్తి గ్రామానికి, పాఠశాలకు మంచి పేరు తీసుకురావాలని వారు ఆకాంక్షించారు.

రూ.12 కోట్ల బకాయిల రికవరీకి రైస్‌మిల్ యజమానుల కస్టడీ విచారణ



పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : మంథనిలో కోట్లాది రూపాయల బకాయిల రికవరీకి సంబంధించిన వ్యవహారంలో పవనసుత రైస్‌మిల్, శ్రీలక్ష్మి రైస్‌మిల్ యజమానులు వొల్లాల నవీన్, పవన్‌లను మంథని పోలీసులు కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నట్లు సమాచారం. సుమారు రూ.12 కోట్ల బకాయిల రికవరీ అంశానికి సంబంధించి ఈ విచారణ కొనసాగుతున్నట్లు తెలిసింది. కోర్టు అనుమతితో కస్టడీలోకి తీసుకున్న వారిని మంథని పోలీస్ స్టేషన్‌కు తరలించిన పోలీసులు.. బకాయిలకు సంబంధించిన లావాదేవీలు, ధాన్యం నిల్వలు, ప్రభుత్వానికి చెల్లించాల్సిన మొత్తాలు తదితర అంశాలపై వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. విచారణలో వెల్లడయ్యే అంశాల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా.. కోట్లాది రూపాయల బకాయిలకు సంబంధించిన రైస్‌మిల్లర్ల వ్యవహారంపై జిల్లా యంత్రాంగం దృష్టి సారించినట్లు సమాచారం. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు బకాయిల వసూళ్లపై సమగ్ర పరిశీలన చేపడుతున్నట్లు తెలిసింది. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించినట్లు తేలితే సంబంధిత మిల్లర్లపై చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉన్నట్లు అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. అయితే కస్టడీ విచారణలో ఉన్న వ్యక్తులపై వచ్చిన ఆరోపణలు కోర్టులో నేరం రుజువయ్యే వరకు నిర్ధారిత నేరంగా పరిగణించరాదు. పోలీసులు దర్యాప్తు పూర్తిచేసి అధికారికంగా వెల్లడించే వివరాల ఆధారంగానే తదుపరి చర్యలు ఉండనున్నాయి.

పెండింగ్ స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు వెంటనే చెల్లించాలి



జనగామ జిల్లా / పాలకుర్తి, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : విద్యార్థులకు చెల్లించాల్సిన పెండింగ్ స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ భారతీయ జనతా పార్టీ పాలకుర్తి మండల అధ్యక్షుడు మారం రవికుమార్ ఆధ్వర్యంలో బుధవారం స్థానిక ఎమ్మార్వోకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. మారం రవికుమార్ మాట్లాడుతూ.. రాష్ట్రంలో సుమారు రూ.15 వేల కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు పెండింగ్‌లో ఉన్నాయని ఆరోపించారు. బకాయిలను విడుదల చేయకుండా ప్రభుత్వం లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడుతోందని విమర్శించారు. ప్రభుత్వం వెంటనే పెండింగ్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బకాయిల చెల్లింపులు ఆలస్యం కావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, ఉన్నత విద్యను కొనసాగించేందుకు ఆర్థిక సమస్యలు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు. స్కాలర్‌షిప్, ఫీజు రీయింబర్స్‌మెంట్ విద్యార్థులకు ప్రభుత్వం చేసే దానం కాదని, అది ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న మొత్తాలను తక్షణమే విడుదల చేసి వారిని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా నాయకులు కమ్మగాని శ్రీకాంత్ గౌడ్, కడుదుల నిరంజన్, మండల ప్రధాన కార్యదర్శులు పెనుగొండ సోమేశ్వర్, వేల్పుల దేవరాజ్, పూజారి మహేష్, మండల నాయకులు వేమునూరి శ్రీనివాస్, చల్ల వినయ్, బెల్లి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

దళిత బంధు పథకం తీసుకొచ్చిన మహానాయకుడు కేసీఆర్




ములుగు జిల్లా / మల్లంపల్లి, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : దళిత కుటుంబాల ఆర్థిక స్వావలంబన కోసం ఒక్కో కుటుంబానికి రూ.10 లక్షల చొప్పున 100 శాతం గ్రాంట్ అందించే దళిత బంధు పథకాన్ని తీసుకొచ్చిన ఘనత మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కే దక్కుతుందని ములుగు జిల్లా బీఆర్ఎస్ దళిత నాయకుడు రేణుకుంట్ల సురేష్ అన్నారు. దళితుల ఆత్మగౌరవం, ఆర్థిక స్వావలంబనే లక్ష్యంగా కేసీఆర్ ప్రభుత్వం దళిత బంధు వంటి చారిత్రాత్మక పథకాన్ని అమలు చేసిందని పేర్కొన్నారు. దళిత కుటుంబాలు ఎవరి మీద ఆధారపడకుండా తమ కాళ్లపై తాము నిలబడాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని రూపొందించారని తెలిపారు. కేసీఆర్‌కు దళితులపై ఉన్న ప్రేమ, చిత్తశుద్ధి తెలంగాణలో మరే నాయకుడికి లేదని రేణుకుంట్ల సురేష్ వ్యాఖ్యానించారు. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం దళిత వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని ఆయన విమర్శించారు. దళితుల జీవితాల్లో వెలుగులు నింపేందుకు, అణగారిన వర్గాల అభ్యున్నతికి కేసీఆర్ నాయకత్వం బాటలు వేసిందని అన్నారు. దళితుల చేతికి ఆర్థిక బలాన్ని అందించి, వారి ఆత్మగౌరవాన్ని పెంపొందించేందుకు దళిత బంధు వంటి పథకాలను తీసుకొచ్చారని పేర్కొన్నారు. దళితుల సంక్షేమం, ఆత్మగౌరవం, ఆర్థిక స్వావలంబన కోసం కేసీఆర్ చేసిన కృషిని ప్రజలు గుర్తుంచుకుంటారని బీఆర్ఎస్ నాయకుడు రేణుకుంట్ల సురేష్ అన్నారు.

Nityam Nigha 10.09.26_Layout 1 9/10/2026 6:34 AM Page 7

రోగాలకు వైద్యం.. పారిశుద్ధ్యానికి నిర్లక్ష్యం

వరంగల్/వర్ధన్నపేట, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : రోగాలకు చికిత్స అందించాల్సిన ప్రభుత్వ ఆసుపత్రిలో పారిశుద్ధ్య నిర్వహణపై ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రిలో శానిటేషన్ సిబ్బంది సక్రమంగా విధులకు హాజరు కావడం లేదన్న ఆరోపణల నేపథ్యంలో ఆసుపత్రి పరిశుభ్రతపై రోగులు, వారి బంధువులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిత్యం వందలాది మంది రోగులు, వారి సహాయకులు వచ్చే ఆసుపత్రిలో పరిశుభ్రమైన వాతావరణం అత్యంత అవసరమని, అయితే పారిశుద్ధ్య నిర్వహణ సరిగా లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అనారోగ్యంతో ఆసుపత్రికి వచ్చే వారికి అపరిశుభ్ర వాతావరణం మరింత ఇబ్బందికరంగా మారే అవకాశం ఉందని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.









అవసరం ఉందని స్థానికులు పేర్కొంటున్నారు.

జీతాలు తక్కువ.. అందుకే రావడం లేదు

శానిటేషన్ సిబ్బంది విధులకు ఎందుకు హాజరు కావడం లేదన్న అంశంపై ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను వివరణ కోరగా.. శానిటేషన్ సిబ్బందికి తక్కువ జీతాలు అందుతున్నందువల్లే వారు విధులకు రావడం లేదని, అందుకు కారణం తనకు తెలియదని పేర్కొన్నట్లు సమాచారం. సూపరింటెండెంట్ చేసిన ఈ వ్యాఖ్యలు ఆసుపత్రి వర్గాల్లో, స్థానికంగా చర్చకు దారితీశాయి. సిబ్బంది హాజరు, పారిశుద్ధ్య నిర్వహణను పర్యవేక్షించాల్సిన బాధ్యత ఎవరిపై ఉందనే ప్రశ్నలు రోగుల బంధువుల నుంచి వినిపిస్తున్నాయి. జీతాల సమస్య ఉంటే దానిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించాల్సిన బాధ్యత ఎవరిది? సిబ్బంది విధులకు హాజరవుతున్నారా లేదా అన్నది అధికారులు పర్యవేక్షిస్తున్నారా? ప్రత్యామ్నాయ పారిశుద్ధ్య ఏర్పాట్లు చేశారా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి.

రోగులకు పరిశుభ్రమైన వాతావరణం కల్పించాలి

ఆసుపత్రిలో మందులు, వైద్య సేవలతో పాటు పరిశుభ్రమైన వాతావరణం కూడా ఎంతో ముఖ్యమని రోగుల బంధువులు పేర్కొంటున్నారు. “రోగాలను నయం చేయాల్సిన ఆసుపత్రిలోనే పారిశుద్ధ్యం సరిగా లేకపోతే మా పరిస్థితి ఏమిటి?” అంటూ పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రిలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తక్షణమే దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు. ఆసుపత్రిలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించి శానిటేషన్ సిబ్బంది హాజరు, పరిశుభ్రత నిర్వహణ, రోగులకు అందుతున్న మౌలిక సదుపాయాలపై సమగ్రంగా పరిశీలించాలని డిమాండ్ చేస్తున్నారు. శానిటేషన్ సిబ్బంది విధులకు సక్రమంగా హాజరు కాకపోతే కారణాలను పరిశీలించి తగిన చర్యలు తీసుకోవాలని, జీతాల సమస్య ఉన్నట్లయితే దానిని పరిష్కరించి ఆసుపత్రి పారిశుద్ధ్య వ్యవస్థను గాడిలో పెట్టాలని కోరుతున్నారు. ప్రజల ఆరోగ్యానికి సంబంధించిన అంశం కావడంతో ఉన్నతాధికారులు స్పందించి వర్ధన్నపేట ఏరియా ఆసుపత్రిలో రోగులకు పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించేలా చర్యలు తీసుకోవాల్సిన

సిద్ధార్థ పాఠశాలలో ఘనంగా తెలంగాణ భాషా దినోత్సవ వేడుకలు

జనగామ జిల్లా/పాలకుర్తి, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : పాలకుర్తి మండల కేంద్రంలోని సిద్ధార్థ పాఠశాలలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని కాళోజీ నారాయణరావు జయంతిని పురస్కరించుకుని విద్యార్థులు, ఉపాధ్యాయులు ఘనంగా నిర్వహించారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ప్రతిబింబించేలా పాఠశాల ప్రాంగణాన్ని ప్రత్యేకంగా అలంకరించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు జక్కుల రవీందర్ కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ‘నా గొడవ’ రచన ద్వారా కాళోజీ ప్రజల గొంతుకగా నిలిచారని, ఆయన జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శనీయమని అన్నారు. తెలంగాణ యాస, భాషలోని తీయదనం, గొప్పతనాన్ని నేటితరం విద్యార్థులు కాపాడుకోవాలని సూచించారు. మాతృభాషను గౌరవించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని, కాళోజీ జీవితాన్ని ఆదర్శంగా తీసుకుని సమాజం పట్ల బాధ్యతతో వ్యవహరించాలని విద్యార్థులకు పిలుపునిచ్చారు. వేడుకల్లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. తెలంగాణ భాష, సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబించేలా విద్యార్థులు చేసిన ప్రదర్శనలకు అభినందనలు లభించాయి. ఈ కార్యక్రమంలో పాఠశాల కరస్పాండెంట్ జక్కుల ఊర్మిళ, దామోదర్, సౌమ్యతో పాటు ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు పాల్గొన్నారు.



రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలి



ములుగు జిల్లా / మల్లంపల్లి, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి కారణంగా రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బీఆర్ఎస్ యువజన అధ్యక్షుడు మొర్రిరాజు యాదవ్ అన్నారు. రైతులకు అవసరమైన ఎరువుల సరఫరా, రైతు సంక్షేమ పథకాల అమలులో ప్రభుత్వాల వైఖరి సరిగా లేదని విమర్శించారు.రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ వ్యవసాయ అధికారి (ఏవో) నల్లాల శ్రీధర్‌కు బుధవారం వినతిపత్రం అందజేశారు. రైతు కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించే చర్యలు చేపట్టాలని, రైతులకు ఎంతో ఉపయోగకరంగా ఉన్న రైతుబీమా పథకాన్ని పునరుద్ధరించాలని ప్రభుత్వాన్ని కోరారు. సాగు సమయంలో రైతులకు ఎరువులు సకాలంలో అందేలా చర్యలు తీసుకోవాలని, ఎరువుల కొరత లేకుండా అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని మొర్రిరాజు యాదవ్ డిమాండ్ చేశారు. రైతుల సంక్షేమాన్ని ప్రభుత్వం ప్రాధాన్యంగా తీసుకుని వారి సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎండి పాషా, కుక్కల సంపత్, వాసు తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి బీజేపీ అండ

వరంగల్/ వర్ధన్నపేట, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : అనారోగ్యంతో మృతి చెందిన తాటికాయల రాములు కుటుంబానికి బీజేపీ మండల అధ్యక్షుడు అడుప రాజు అండగా నిలిచారు. వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామానికి చెందిన రాములు ఇటీవల మృతి చెందడంతో బుధవారం ఆయన కుటుంబాన్ని అడుప రాజు పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చి, వారి కష్టసుఖాలను అడిగి తెలుసుకున్నారు. కుటుంబానికి తక్షణ సహాయంగా బియ్యం అందజేసి తనవంతు భరోసా కల్పించారు. ఆపద సమయంలో బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అని అడుప రాజు అన్నారు. రాములు మృతి కుటుంబానికి తీరని లోటని, విషాద సమయంలో కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని సూచించారు. బాధిత కుటుంబానికి బీజేపీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, భవిష్యత్తులో అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు తనవంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో బీజేపీ మాజీ మండల ప్రధాన కార్యదర్శి తాల్లపెల్లి కృష్ణమూర్తి, వేల్పుల కార్తీక్, మైదం కన్నయ్య, వేల్పుల అశోక్, చిన్నపెల్లి శ్రీకాంత్, రాజు తదితరులు పాల్గొన్నారు.



జమ్మికుంట ప్రజలకు మరింత చేరువగా వైద్య సేవలు

- **ప్రజల ఆరోగ్యమే లక్ష్యంగా మైత్రి మల్టీ-స్పెషాలిటీ హాస్పిటల్‌కు శ్రీకారం**
- **వైద్య రంగంలో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న డాక్టర్ విజేత రెడ్డి, డాక్టర్ కార్తిక్ రెడ్డి**

కరీంనగర్ జిల్లా / జమ్మికుంట, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి): : జమ్మికుంట పట్టణ ప్రజలకు మరింత చేరువగా నాణ్యమైన వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో డాక్టర్ విజేత రెడ్డి, డాక్టర్ కార్తిక్ రెడ్డి మైత్రి మల్టీ–స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రారంభించారు. గత కొన్నేళ్లుగా జమ్మికుంటలోని వివిధ ఆసుపత్రుల్లో వైద్య సేవలు అందిస్తూ స్థానిక ప్రజలతో అనుబంధాన్ని ఏర్పరచుకున్న ఈ ఇద్దరు వైద్యులు.. ఇక తమ సొంత ఆసుపత్రి ద్వారా మరింత విస్తృతమైన వైద్య సేవలు అందించేందుకు ముందుకు వచ్చారు. రోగులకు వైద్యం అందించడం కేవలం వృత్తి మాత్రమే కాకుండా, ప్రజల ప్రాణాలను కాపాడే బాధ్యతగా భావిస్తూ సేవా దృక్పథంతో ముందుకు సాగుతున్నట్లు వైద్యులు తెలిపారు. జమ్మికుంటతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో ఆసుపత్రిని ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు.

వివిధ విభాగాల్లో వైద్య సేవలు

మైత్రి మల్టీ–స్పెషాలిటీ హాస్పిటల్‌లో వివిధ వైద్య విభాగాల్లో సేవలు అందించేందుకు ఏర్పాట్లు చేశారు. డాక్టర్ కార్తిక్ రెడ్డి MBBS, MS, FMAS, FISC(P), FIAGES అర్హతలతో జనరల్, ల్యాపరోస్కోపిక్ సర్జరీ విభాగంలో వైద్య సేవలు అందించనున్నారు. సాధారణ శస్త్రచికిత్సలతో పాటు ల్యాపరోస్కోపిక్ సర్జరీ సేవలు అందించనున్నారు. డాక్టర్ విజేత రెడ్డి MBBS, MD అర్హతలతో రెస్పిరేటరీ మెడిసిన్, స్లీప్ స్పెషలిస్ట్, ఫెలోషిప్ ఇన్ డయాబెటాలజీ విభాగాల్లో సేవలు అందించనున్నారు. శ్వాసకోశ సమస్యలు, నిద్ర సంబంధిత సమస్యలు, డయాబెటిస్ తదితర ఆరోగ్య సమస్యలకు వైద్య సేవలు అందించనున్నారు.

అత్యవసర సమయాల్లో 24 గంటల సేవలు

అత్యవసర పరిస్థితుల్లో సకాలంలో వైద్యం అందించడాన్ని దృష్టిలో ఉంచుకుని 24 గంటల ఎమర్జెన్సీ సేవలకు ప్రాధాన్యత కల్పించినట్లు ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. జమ్మికుంట పట్టణంతో పాటు పరిసర గ్రామాల ప్రజలకు అత్యవసర సమయంలో వైద్య సహాయం అందుబాటులో ఉండేలా సేవలు కొనసాగించనున్నట్లు పేర్కొన్నారు.

వైద్యంతో పాటు ఆరోగ్య అవగాహన



అనారోగ్యానికి గురైన తర్వాత చికిత్స పొందడం కంటే ముందుగానే ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండటం ముఖ్యమని వైద్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో అవసరమైన ఆరోగ్య పరీక్షలు, వైద్య సలహాలు, వ్యాధులపై అవగాహన కల్పించడం వంటి అంశాలకు కూడా ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు చెప్పారు. రోగి ఆరోగ్య సమస్యతో పాటు వారి కుటుంబ పరిస్థితులు, ఆందోళనలను అర్థం చేసుకుని మానవతా దృక్పథంతో వైద్యం అందించడమే తమ లక్ష్యమని డాక్టర్ విజేత రెడ్డి, డాక్టర్ కార్తిక్ రెడ్డి తెలిపారు. ఇప్పటివరకు తమపై నమ్మకంతో వైద్య సేవలు పొందిన



జమ్మికుంట ప్రజల ఆదరణ తమకు ఎంతో ప్రోత్సాహాన్ని ఇచ్చిందని, అదే నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నాణ్యమైన వైద్య సేవలను అందుబాటులో ఉంచేందుకు కృషి చేస్తామని పేర్కొన్నారు. “హీలింగ్ హ్యాండ్స్ – హెల్తీ బ్రీత్” అనే సందేశంతో ప్రజల ఆరోగ్యానికి అండగా నిలవాలనే సంకల్పంతో మైత్రి మల్టీ–స్పెషాలిటీ హాస్పిటల్ సేవలను ప్రారంభించింది. జమ్మికుంట ప్రజలకు అందుబాటులో ఉండే వైద్య సేవల కేంద్రంగా ఎదగడమే తమ లక్ష్యమని వైద్యులు తెలిపారు.

Nityam Nigha 10.09.26_Layout 1 9/10/2026 6:34 AM Page 8

ప్రభుత్వ ఉద్యోగాల పేరుతో నిరుద్యోగ యువతను మోసం చేసిన వ్యక్తి అరెస్ట్



హనుమకొండ / కాజీపేట, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :
ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి నిరుద్యోగ యువత నుంచి భారీ మొత్తంలో నగదు, బంగారం, అసలు విద్యా సర్టిఫికెట్లు సేకరించి మోసాలకు పాల్పడుతున్న వ్యక్తిని కాజీపేట పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల వివరాల ప్రకారం.. నిందితుడు మెట్టు ప్రవీణ్ కుమార్ (41), నిజామాబాద్ జిల్లా వాసిగా గుర్తించారు. ఇన్‌కమ్ ట్యాక్స్ శాఖలో ట్యాక్స్ అసిస్టెంట్, ఇన్‌కమ్ ట్యాక్స్ ఆఫీసర్ తదితర ఉద్యోగాలు ఇప్పిస్తానని నమ్మించి పలువురు నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసినట్లు పోలీసుల దర్యాప్తులో వెల్లడైంది.

నకిలీ నియామక ఉత్తర్వులతో మోసం

స్పోర్ట్స్ కోటా, ఎన్‌సీసీ కోటా, బ్యాక్‌డోర్ రిక్రూట్‌మెంట్ పేరుతో ఉద్యోగాలు ఇప్పిస్తానని నిందితుడు అభ్యర్థులను ఆకర్షించినట్లు పోలీసులు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన వెబ్‌సైట్లను చూపిస్తూ, గతంలో జారీ చేసిన నియామక ఉత్తర్వుల్లో పేర్లు మార్చి నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు, మెమోరాండంలను తయారు చేసి అభ్యర్థులకు చూపించినట్లు పేర్కొన్నారు. మోసం మరింత నమ్మదగినదిగా కనిపించేలా మెడికల్ టెస్టులు, పోలీస్ వెరిఫికేషన్ వంటి ప్రక్రియలు నిర్వహిస్తున్నట్లు నటించినట్లు పోలీసులు తెలిపారు. అలాగే ICAIలో నిర్వహించే ఓరియంటేషన్, ఐటీ కోర్సులను ప్రభుత్వ ఉద్యోగాలకు సంబంధించిన శిక్షణగా నమ్మించి పలువురు యువతను మోసం చేసినట్లు దర్యాప్తులో తేలిందన్నారు.

రూ.85 లక్షలు, 4 తులాల బంగారం వసూలు

ఇప్పటివరకు గుర్తించిన బాధితుల నుంచి సుమారు రూ.85 లక్షల నగదు, 4 తులాల బంగారం తీసుకున్నట్లు పోలీసులు గుర్తించారు. బాధితుల నుంచి అసలు విద్యా సర్టిఫికెట్లు, ఉద్యోగ సంబంధిత పత్రాలను కూడా నిందితుడు తీసుకున్నట్లు వెల్లడించారు.

రూ.18.22 లక్షల విలువైన వస్తువులు స్వాధీనం

నిందితుడి వద్ద నుంచి సుమారు రూ.18.22 లక్షల విలువైన నగదు, ఇతర వస్తువులను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

స్వాధీనం చేసుకున్న వాటిలో:

★ Dell i7 8th Generation Laptop
★ Maruti Brezza కారు
★ రూ.2 లక్షల నగదు
★ iPhone 17 Pro Max
★ OPPO స్మార్ట్‌ఫోన్
★ రెండు కీప్యాడ్ మొబైల్ ఫోన్లు
★ బాధితులకు సంబంధించిన అసలు విద్యా సర్టిఫికెట్లు, ఉద్యోగ పత్రాలు
★ నకిలీ నియామక ఉత్తర్వుల తయారీకి ఉపయోగించిన పారదర్శక షీట్లు/ప్లాస్టర్, ఎల్లో హైలైటర్
★ Audit Identity Card జిరాక్స్ కాపీ తదితర సామగ్రి

అదనంగా పలువురు బాధితులకు సంబంధించిన కీలకమైన అసలు పత్రాలను కూడా పోలీసులు స్వాధీనం చేసుకున్నారు.

మరింత మంది బాధితులపై ఆరా

కాజీపేట ఏసీపీ పి. ప్రశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు, కాజీపేట పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ ఇన్‌స్పెక్టర్ జే. శ్యామ్ సుందర్ పర్యవేక్షణలో పోలీసులు దర్యాప్తు చేపట్టి నిందితుడిని గుర్తించి అరెస్ట్ చేశారు. ఈ వ్యవహారంలో మరింత మంది బాధితులు ఉన్నారా? నిందితుడి మోసాల వెనుక మరెవరైనా ఉన్నారా? అనే కోణాల్లో దర్యాప్తు కొనసాగుతున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రభుత్వ ఉద్యోగాలు ఇప్పిస్తామని, బ్యాక్‌డోర్ రిక్రూట్‌మెంట్ ద్వారా ఉద్యోగం వస్తుందని, ప్రత్యేక కోటాలో ఉద్యోగం ఇప్పిస్తామని లేదా ప్రభుత్వ అధికారులతో పరిచయాలు ఉన్నాయని చెప్పి ఎవరైనా డబ్బులు అడిగితే అప్రమత్తంగా ఉండాలని కాజీపేట పోలీసులు సూచించారు. ప్రభుత్వ ఉద్యోగాల నియామక ప్రక్రియ, నోటిఫికేషన్లు, ఫలితాలు తదితర సమాచారాన్ని సంబంధిత ప్రభుత్వ శాఖల అధికారిక వెబ్‌సైట్లు, అధికారిక నోటిఫికేషన్ల ద్వారా మాత్రమే ధృవీకరించుకోవాలని తెలిపారు. నకిలీ అపాయింట్‌మెంట్ ఆర్డర్లు, ఐడీ కార్డులు, జీతం స్లిప్పులు లేదా ఇతర అధికారిక పత్రాలు చూపించినా సంబంధిత శాఖ అధికారుల ద్వారా తప్పని సరిగా ధృవీకరించుకోవాలని సూచించారు. “ప్రభుత్వ ఉద్యోగానికి షార్ట్‌కట్ లేదు.. ఉద్యోగాల పేరుతో డబ్బులు అడిగే వ్యక్తులను నమ్మవద్దు.” అని కాజీపేట పోలీసులు ప్రజలకు సూచించారు.

ట్రై సిటీస్ హాఫ్ మారథాన్ - 2026 పోస్టర్ ఆవిష్కరణ



హనుమకొండ, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : క్రెడాయ్ వరంగల్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న ‘ట్రై సిటీస్ హాఫ్ మారథాన్–2026, ఎడిషన్–2’ పోస్టర్‌ను జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయ్‌తో కలిసి యువ నాయకుడు విష్ణు వర్ధన్ రెడ్డి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. అనంతరం పోలీస్ కమిషనర్ శ్వేత, ఐపీఎస్‌ను సీపీ కార్యాలయంలో కలిసి మారథాన్ నిర్వహణకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించేందుకు పోలీస్ శాఖ సహకారం అందించాలని కోరారు.

అక్టోబర్ 11న మారథాన్

అక్టోబర్ 11, 2026న హనుమకొండలోని కాళోజీ కళాక్షేత్రం గ్రౌండ్స్ నుంచి మారథాన్ ప్రారంభం కానుంది. ఇందులో 21.1 కిలోమీటర్ల హాఫ్ మారథాన్‌తో పాటు 10 కిలోమీటర్లు, 5 కిలోమీటర్ల రన్ నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. యువతలో ఆరోగ్యం, ఫిట్‌నెస్‌పై అవగాహన పెంపొందించడంతో పాటు వరంగల్ ట్రై సిటీస్‌లో క్రీడా స్ఫూర్తిని ప్రోత్సహించడమే మారథాన్ ప్రధాన ఉద్దేశమని పేర్కొన్నారు. కార్యక్రమానికి జిల్లా యంత్రాంగం, పోలీస్ శాఖ సహకారం కోరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు సోమయ్య, కందుకూరు శ్రీనివాస్, రన్నర్స్ చరణ్, సరస్వతి తదితర నిర్వాహకులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

గుండాయిజం, రౌడీయిజం సంస్కృతిని బీఆర్ఎస్ మానుకోవాలి



హైదరాబాద్, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :
బీఆర్ఎస్ నాయకులు గుండాయిజం, రౌడీయిజం సంస్కృతిని వీడి ప్రజాస్వామ్య పద్ధతుల్లో వ్యవహరించాలని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి సూచించారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద ఆయన మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి, అక్రమాలు, భూకబ్జాలు, పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకే ఆ పార్టీ నాయకులు కొత్త అంశాలను తెరపైకి తెస్తున్నారని విమర్శించారు. గతంలో మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు తదితరులు వ్యవహరించిన తీరును తెలంగాణ ప్రజలు మరిచిపోలేదని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు ప్రతిపక్ష నాయకులు, ప్రజాప్రతినిధులు, అధికారులు, ప్రజలతో ఎలా వ్యవహరించారో సమాజం మొత్తం చూసిందన్నారు. ప్రస్తుతం బీఆర్ఎస్ నాయకులు చేస్తున్న ప్రతి కార్యక్రమాన్ని కూడా ప్రజలు నిశితంగా గమనిస్తున్నారని పేర్కొన్నారు. అసెంబ్లీ ప్రజాస్వామ్యానికి అత్యున్నత వేదిక అని, సభ్యులు సభా సంప్రదాయాలను పాటిస్తూ హుందాగా, మర్యాదగా వ్యవహరించాల్సిన బాధ్యత ఉందని నాయిని అన్నారు. సభలో ఆరోగ్యకరమైన చర్చకు బదులుగా దూషణలు, దౌర్జన్యాలకు పాల్పడటం సరికాదన్నారు.బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో ఇచ్చిన హామీల్లో ఎన్ని అమలు చేశారో ముందుగా ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. దళితులకు మూడెకరాల భూమి, కేజీ టు పీజీ ఉచిత విద్య, నిరుద్యోగ భృతి వంటి హామీల అమలు పరిస్థితిపై సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తీవ్ర ఇబ్బందుల్లోకి నెట్టిందని నాయిని ఆరోపించారు. ఆర్థిక సవాళ్లను అధిగమిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తోందని తెలిపారు. తమ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను చూసి బీఆర్ఎస్ నాయకులు అసహనానికి గురవుతున్నారని విమర్శించారు. అధికారంలోకి రావడానికి అడ్డదారులు వెతకడం, ప్రజల్లో గందరగోళం సృష్టించడం కాకుండా నిర్మాణాత్మక ప్రతిపక్షంగా వ్యవహరించాలని నాయిని సూచించారు. ప్రజాస్వామ్యాన్ని గౌరవిస్తూ ప్రజలకు ఉపయోగపడే రాజకీయాలు చేయాలని కోరారు. “ఎన్ని కొత్త నాటకాలు ఆడినా ప్రజలు నమ్మే పరిస్థితిలో లేరు. గతంలో మీరు చేసిన ప్రతి పని ప్రజల కళ్ల ముందే ఉంది. గుండాయిజం, రౌడీయిజం సంస్కృతిని మానుకుని ప్రజాస్వామ్య పద్ధతుల్లో వ్యవహరించాలి” అని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి స్పష్టం చేశారు.

ఆర్థిక విధ్వంసంతో సంక్షేమ పథకాలకు నిధుల కొరత



హైదరాబాద్, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) :
గత ప్రభుత్వాలు రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను తీవ్రంగా దెబ్బతీయడంతో ప్రస్తుత ప్రభుత్వం సంక్షేమ పథకాల అమలులో అనేక సవాళ్లు ఎదుర్కొంటోందని వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి అన్నారు. అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలను కనుగొనేందుకు సభా సమయాన్ని సద్వినియోగం చేసుకోవాలని సభ్యులకు సూచించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని, అందుకు ప్రతిపక్ష సభ్యులు సహకరించాలని నాయిని కోరారు. చర్చకు సమయం ఇస్తామని చెప్పినప్పటికీ సభలో చర్చకు కూర్చోకుండా వివిధ రకాల ఆందోళనలకు దిగడం సరైన పద్ధతి కాదన్నారు. ప్రతిపక్ష నేతలు, ఇతర నాయకులు బాధ్యతాయుతమైన ప్రజాప్రతినిధులుగా వ్యవహరించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు, బెదిరింపుల ధోరణికి స్వస్తి పలికి ప్రజా సమస్యలపై నిర్మాణాత్మకంగా చర్చించాలని సూచించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ భద్రత విషయంలో ప్రభుత్వం తగిన జాగ్రత్తలు తీసుకోవాలని నాయిని సభలో కోరారు. భద్రతకు సంబంధించి ఏవైనా అనుమానాలు ఉంటే వాటిపై సమగ్రంగా పరిశీలించి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

పేదల సంక్షేమానికి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాధాన్యం

‘రోటి, కపడా, మకాన్’ వంటి ప్రజా సంక్షేమ లక్ష్యాలతో పేదలకు అండగా నిలిచిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని నాయిని రాజేందర్ రెడ్డి పేర్కొన్నారు. సంక్షేమ పథకాల అమలుతో పాటు రాష్ట్ర అభివృద్ధికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రజాధనం, అసెంబ్లీ సమయం వృథా కాకుండా సభలో చర్చల ద్వారా సమస్యలను పరిష్కరించుకోవాలని సూచించారు. ప్రజలు అన్ని విషయాలను గమనిస్తున్నారని, బాధ్యతారహితమైన వ్యవహారశైలిని ప్రజలు ఎప్పటికీ ఆమోదించరని అన్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన కఠిన చర్యలు తీసుకుని అసెంబ్లీ గౌరవాన్ని, ప్రజాస్వామ్య విలువలను కాపాడాలని సభాపతిని ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి కోరారు.

టేకుమట్ల పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ



భూపాలపల్లి జిల్లా / టేకుమట్ల, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి): :
భూపాలపల్లి జిల్లాలో పోలీసు సేవలను మరింత సమర్థవంతంగా అందించడమే లక్ష్యంగా జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ బుధవారం టేకుమట్ల పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని పలు రికార్డులను పరిశీలించిన ఎస్పీ.. పెండింగ్ కేసుల దర్యాప్తు పురోగతి, సీసీ కెమెరాల పనితీరు, స్టేషన్ పరిసరాల పరిశుభ్రత తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. పెండింగ్ కేసుల దర్యాప్తును వేగవంతం చేయడంతో పాటు ప్రజల నుంచి అందే ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ మాట్లాడుతూ.. శాంతిభద్రతల పరిరక్షణలో పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. నేరాల నియంత్రణకు సమర్థవంతమైన చర్యలు చేపట్టాలని, ప్రజలకు మరింత నాణ్యమైన, పారదర్శకమైన పోలీస్ సేవలు అందించేలా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజలకు పోలీస్ శాఖపై మరింత నమ్మకం కలిగేలా విధులు నిర్వహించాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యత ఇవ్వాలని ఎస్పీ సూచించారు.

Printed, Published and Owned by Bura Nagesh Goud, on behalf of Amulya Publications & Printers Graphics, Editor - Bura Nagesh Goud, is responsible for news selection under PRB act prgi.gov.in RNI. TGTEL/25/A1665, # 5-11-1014/A, Naim Nagar, Hanamkonda, Warangal, Telangana, India - 506009, Cell : 9441974025, 9440170543 Email:nityamnigha.acs@gmail.com

Nityam Nigha 10.09.26_Layout 1 9/10/2026 6:34 AM Page 9

నిత్యం నిఘా
తెలుగు దినపత్రిక

ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించాలి



నిత్యం నిఘా స్పెషల్,సెప్టెంబర్ 09 : ప్రపంచ పర్యాటక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఈ నెల 27న జిల్లాల్లో వివిధ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించాలని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి వాణి ప్రసాద్ సూచించారు. బుధవారం హైదరాబాద్ నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, వివిధ శాఖల అధికారులతో ఆమె సమీక్ష నిర్వహించారు. ములుగు జిల్లా సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియో సమావేశ మందిరం నుంచి జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాణి ప్రసాద్ మాట్లాడుతూ.. జిల్లాల్లో పర్యాటక రంగ అభివృద్ధికి జిల్లా స్థాయిలో నోడల్ అధికారులను నియమించి, వివిధ శాఖల సమన్వయంతో పర్యాటక ప్రాంతాలను అభివృద్ధి చేయాలని సూచించారు. ప్రపంచ పర్యాటక దినోత్సవం సందర్భంగా ప్రభుత్వం కేటాయించిన నిధులను సద్వినియోగం చేసుకుని ఆకర్షణీయమైన కార్యక్రమాలు నిర్వహించాలని తెలిపారు. యువతలో పర్యాటక రంగంపై ఆసక్తిని పెంపొందించేందుకు పర్యాటక ప్రదేశాల ప్రచారం, అభివృద్ధిపై ఆసక్తి ఉన్న యువతను గుర్తించి ప్రోత్సహించాలని సూచించారు. యువ టూరిజం క్లబ్‌ల పోటీల్లో విజేతలకు బహుమతులు అందించే కార్యక్రమాలను కూడా పర్యాటక దినోత్సవ వేడుకల్లో నిర్వహించాలని తెలిపారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటికే 142 పర్యాటక ప్రాంతాలను గుర్తించిన నేపథ్యంలో, ఆయా ప్రాంతాల్లో సందర్శకులకు అవసరమైన ప్రాథమిక సౌకర్యాలు, మౌలిక వసతులు కల్పించేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. పర్యాటక ప్రాంతాల ప్రాధాన్యతను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లేందుకు వినూత్న ప్రచార కార్యక్రమాలు చేపట్టడంతో పాటు ఫిల్మ్ టూరిజం ద్వారా పర్యాటక ప్రాంతాలను ప్రోత్సహించాలని సూచించారు.

మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి డిజిటలైజేషన్

జ్ఞాన భారత్ కార్యక్రమంలో భాగంగా జిల్లాల్లో అందుబాటులో ఉన్న పురాతన మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి డిజిటలైజేషన్ చేయాలని వాణి ప్రసాద్ తెలిపారు. ఇందుకోసం జిల్లా స్థాయిలో ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి, వివిధ ప్రాంతాలు, దేవాలయాలు, మఠాలు, గ్రంథాలయాలు, విద్యాసంస్థలు, ఇతర సంస్థలు, వ్యక్తుల వద్ద ఉన్న మాన్యుస్క్రిప్ట్‌లను గుర్తించి సమగ్ర జాబితా రూపొందించాలని సూచించారు. గుర్తించిన మాన్యుస్క్రిప్ట్‌లను డిజిటలైజ్ చేసి కేంద్రీకృత సేకరణలోకి తీసుకువచ్చేలా చర్యలు చేపట్టాలని తెలిపారు. జిల్లాలోని చారిత్రక, సాంస్కృతిక, సహజ పర్యాటక ప్రదేశాలను సమగ్రంగా అభివృద్ధి చేసి, విస్తృత ప్రచారం కల్పించడం ద్వారా ములుగు జిల్లాను ప్రముఖ పర్యాటక గమ్యస్థానంగా తీర్చిదిద్దేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు.

అధికారుల సమన్వయంతో అభివృద్ధి

జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలోని పర్యాటక ప్రాంతాల అభివృద్ధికి సంబంధిత శాఖల అధికారుల సమన్వయంతో చర్యలు చేపడతామని తెలిపారు. పర్యాటక ప్రాంతాల విశిష్టతను ప్రజలందరికీ తెలిసేలా విస్తృత ప్రచారం నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) సంపత్ రావు, జిల్లా టూరిజం నోడల్ అధికారి డాక్టర్ ధర్మ నాయక్, డీఈఓ సిద్ధార్థ రెడ్డి, డీఐఓ వీరేందర్, డీపీఆర్ఓ రఫిక్ తదితరులు పాల్గొన్నారు.

కాళోజీ ప్రజా చైతన్యానికి ప్రతీక



వరంగల్, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : తెలంగాణ ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి, ప్రజల హక్కుల కోసం జీవితాంతం పోరాడిన మహనీయుడు కాళోజీ నారాయణరావు అని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు అన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ తొలిపొద్దు కాళోజీ అని కొనియాడారు. ప్రజాకవిగా, ఉద్యమకారుడిగా భారత స్వాతంత్ర్య పోరాటంతో పాటు తెలంగాణ ఉద్యమంలోనూ కాళోజీ కీలక పాత్ర పోషించారని పేర్కొన్నారు. నిరంకుశత్వం, అరాచక పాలనకు వ్యతిరేకంగా గళమెత్తి తెలంగాణ ప్రజల్లో చైతన్యం రగిలించిన వైతాళికుడు కాళోజీ అని అన్నారు. పలు భాషల్లో రచనలు చేస్తూ ప్రజల హక్కుల కోసం పోరాడారని తెలిపారు. తెలంగాణ వాడుక భాషలో రచనలను ప్రాచుర్యంలోకి తీసుకొచ్చి, తెలంగాణ భాషకు ప్రత్యేక గుర్తింపు తీసుకురావడంలో కాళోజీ విశేష కృషి చేశారని పేర్కొన్నారు “పుట్టుక నీది.. చావు నీది.. బతుకంతా దేశానిది” అనే భావనతో జీవించిన కాళోజీ జీవితం ప్రతి ఒక్కరికీ ఆదర్శమన్నారు. ప్రజా సేవ పట్ల ఆయనకున్న నిబద్ధతకు నిదర్శనంగా, మరణానంతరం తన శరీరాన్ని కాకతీయ వైద్యశాలకు దానం చేయాలని కుటుంబ సభ్యులకు ముందుగానే సూచించారని గుర్తుచేశారు. కాళోజీ సేవలను గౌరవిస్తూ అప్పటి కేసీఆర్ ప్రభుత్వం సెప్టెంబర్ 9ను తెలంగాణ భాషా దినోత్సవంగా ప్రకటించడంతో పాటు కాళోజీ పురస్కారాన్ని ఏర్పాటు చేసిందని ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. వరంగల్‌లోని వైద్య విశ్వవిద్యాలయానికి కాళోజీ నారాయణరావు పేరు పెట్టడంతో పాటు హనుమకొండలో కాళోజీ కళాక్షేత్రం నిర్మాణానికి చర్యలు చేపట్టిందని పేర్కొన్నారు. కాళోజీ జయంతి సందర్భంగా ఆయన రచనలు, ఆశయాలను తెలంగాణ యువత స్ఫూర్తిగా తీసుకుని ప్రజా సమస్యలపై చైతన్యంతో ముందుకు సాగాలని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆకాంక్షించారు. కాళోజీ నారాయణరావుకు ఘన నివాళులు అర్పించారు.

కాళోజీ ఆశయాలను కొనసాగించాలి



భూపాలపల్లి, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : తెలంగాణ ప్రజాకవి, స్వాతంత్ర్య సమరయోధుడు, ప్రజా ఉద్యమాల గొంతుక కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా భూపాలపల్లి జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ కాళోజీ నారాయణరావు చిత్రపటానికి పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం అడిషనల్ ఎస్పీ నరేష్ కుమార్ మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజల సమస్యలను తన రచనలు, కవిత్వం ద్వారా సమాజానికి తెలియజేసిన మహోన్నత వ్యక్తి కాళోజీ నారాయణరావు అని కొనియాడారు. ప్రజల్లో చైతన్యం తీసుకురావడంతో పాటు సామాజిక విలువలను పెంపొందించడంలో ఆయన సాహిత్యం కీలక పాత్ర పోషించిందన్నారు. కాళోజీ రచించిన ‘నా గొడవ’ వంటి రచనలు ప్రజల ఆలోచనా విధానాన్ని ప్రభావితం చేసి, అన్యాయాన్ని ప్రశ్నించే ధైర్యాన్ని కల్పించాయని పేర్కొన్నారు. ఆయన ఆశయాలు, ప్రజాస్వామ్య విలువలు, సామాజిక బాధ్యత వంటి స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ కొనసాగించాలని సూచించారు. కాళోజీ నారాయణరావు ఆశయాలను స్ఫూర్తిగా తీసుకుని ప్రజలకు మరింత మెరుగైన సేవలు అందించేందుకు పోలీస్ అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని అడిషనల్ ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐలు రత్నం, పూర్ణచందర్, కాశీరాం, ఆర్ఎస్ఐలు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అగ్నికి ఆహుతైన ఆపన్నహస్తం..

హనుమకొండ, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : హనుమకొండ అదాలత్ జంక్షన్‌లోని లింగాల కేదారి హోటల్‌లో జరిగిన భారీ అగ్ని ప్రమాదం ఓరుగల్లు ప్రజలను తీవ్ర విషాదంలోకి నెట్టింది. ప్రమాదంలో హోటల్ యజమాని లింగాల కేదారి, ఆయన భార్య తీవ్రంగా గాయపడగా.. ఆస్పత్రికి తరలించే క్రమంలో కేదారి మృతి చెందారు. ఆయన భార్య తీవ్ర గాయాలతో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలుస్తోంది.అయితే కేదారి మృతి కేవలం ఓ హోటల్ యజమాని ప్రాణాలు కోల్పోయిన విషాదం మాత్రమే కాదు. ఎన్నో ఏళ్లుగా ఆకలితో వచ్చిన వారికి అన్నం పెట్టిన ఓ ఆపన్నహస్తం దూరమైన విషాదంగా హనుమకొండ ప్రజలు భావిస్తున్నారు.

ఉద్యమకారులకు అండగా..

తెలంగాణ ఉద్యమం ఉవ్వెత్తున సాగుతున్న సమయంలో అదాలత్ సెంటర్‌లోని అమర వీరుల స్తూపం వద్దకు వచ్చే విద్యార్థులు, ఉద్యమకారులకు కేదారి దంపతులు తమ హోటల్ ద్వారా ఉచితంగా టీ, టిఫిన్, భోజనాలు అందించేవారు. ఉద్యమకారుల కష్టాలను తన కష్టాలుగా భావించిన కేదారి.. వారికి ఆహారం అందించడాన్ని సేవగా భావించారు.లాభార్జన కంటే మానవీయతకే ప్రాధాన్యం ఇస్తూ హోటల్‌ను నిర్వహించిన ఆయన.. ఉద్యమం ముగిసిన తర్వాత కూడా తన సేవా దృక్పథాన్ని కొనసాగించారు. భార్యాభర్తలిద్దరూ హోటల్‌లో స్వయంగా పని చేస్తూనే సామాజిక సేవకు ప్రాధాన్యం ఇచ్చారు. దీంతో కేదారి పేరు హనుమకొండలో ప్రత్యేక గుర్తింపు పొందింది.

ఆహారాన్ని వృథా చేయొద్దు’ అంటూ..

ఆహారాన్ని వృథా చేయొద్దనే సందేశాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలోనూ కేదారి ముందుండేవారు. ఆకలితో ఉన్నవారికి ఆహారం అందించడంతో పాటు, అందుబాటులో ఉన్న ఆహారాన్ని వృథా చేయకుండా చూడాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అవగాహన కల్పించారు .‘ఆహారాన్ని వృథా చేయొద్దు’ అనే సందేశాన్ని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లిన కేదారి.. హోటల్‌ను కేవలం వ్యాపార కేంద్రంగా కాకుండా, నలుగురికి ఉపయోగపడే వేదికగా తీర్చిదిద్దారు. ఆకలితో వచ్చిన వారికి భోజనం పెట్టడం, అవసరమైన వారికి చేయూతనివ్వడం ద్వారా కేదారి దంపతులు ప్రజల హృదయాల్లో ప్రత్యేక స్థానం సంపాదించుకున్నారు.

ప్రధానితో మాట్లాడే స్థాయికి గుర్తింపు

కేదారి సేవా కార్యక్రమాలకు జాతీయ స్థాయిలోనూ గుర్తింపు లభించింది. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ‘మన్ కీ బాత్’ కార్యక్రమంలో భాగంగా సుమారు రెండేళ్ల క్రితం కేదారితో మాట్లాడినట్లు సమాచారం. సాధారణ హోటల్‌ను నిర్వహిస్తూ సామాజిక సేవకు ప్రాధాన్యం ఇచ్చిన కేదారి.. ప్రధానితో మాట్లాడే స్థాయిలో గుర్తింపు పొందడం ఆయన సేవా ప్రస్థానానికి నిదర్శనంగా నిలిచింది. సంపాదన కంటే సేవ, సంతృప్తికే విలువనిచ్చిన కేదారి దంపతులు తమ జీవితాన్ని సమాజంతో మమేకం చేశారు. అందుకే ఆయనను దగ్గరగా చూసిన వారు కేదారిని హోటల్ యజమానిగా కాకుండా సేవామూర్తిగా గుర్తు చేసుకుంటున్నారు.

అగ్నికి ఆహుతైన సేవా జీవితం



బుధవారం హోటల్‌లో ఒక్కసారిగా మంటలు చెలరేగడంతో కేదారి దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. సమాచారం అందుకున్న పోలీసులు, ఇతర సిబ్బంది అక్కడికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. తీవ్రంగా గాయపడిన వారిని వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా.. మార్గమధ్యలోనే కేదారి మృతి చెందారు.ఎంతోమంది ఆకలి తీర్చిన చేతులు చివరకు అగ్నిప్రమాదంలో ఆగిపోవడం ఆయన సేవలను గుర్తు చేసుకుంటున్న వారిని కలచివేస్తోంది. ఉద్యమకారులకు ఉచితంగా ఆహారం అందించిన రోజులు, ఆహార వృథాపై చేసిన అవగాహన, అవసరమైన వారికి అందించిన చేయూతను గుర్తుచేసుకుంటూ పలువురు కన్నీటి పర్యంతమవుతున్నారు. కేదారి మృతి పట్ల ఓరుగల్లు ప్రజలు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. ఆయన భౌతికంగా దూరమైనా.. ఆకలితో వచ్చిన వారికి అన్నం పెట్టిన ఆ చేతులు, సమాజం కోసం చేసిన సేవలు మాత్రం హనుమకొండ ప్రజల జ్ఞాపకాల్లో చిరస్థాయిగా నిలిచిపోనున్నాయి.

రాజకీయ రగడలో నలుగుతున్న ఖాకీలు



పెద్దపల్లి జిల్లా / మంథని, సెప్టెంబర్ 09 (నిత్యం నిఘా ప్రతినిధి) : మంథని నియోజకవర్గంలో రాజకీయ నాయకుల మధ్య నెల కొంటున్న విభేదాలు పోలీసు యంత్రాంగానికి క్రమంగా తలనొప్పిగా మారుతున్నాయనే చర్చ సాగుతోంది. ప్రజల భద్రత, శాంతిభద్రతల పరిరక్షణతో పాటు చట్టాన్ని అమలు చేయాల్సిన పోలీసులు.. రాజకీయ వర్గాల మధ్య నెలకొంటున్న వివాదాల ప్రభావాన్ని ఎదుర్కొంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఒకవైపు రాజకీయ ఒత్తిళ్లు.. మరోవైపు చట్టపరమైన నిబంధనలు.. ఈ రెండింటి మధ్య పోలీసులు నలిగిపోతున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏ ఫిర్యాదుపై ఎలా స్పందించాలి? ఎవరి మాట వినాలి? ఎలాంటి చర్యలు తీసుకోవాలి? అనే విషయంలో అధికారులు ఆచితూచి వ్యవహరించాల్సిన పరిస్థితి ఏర్పడుతోందని పలువురు పేర్కొంటున్నారు. రాజకీయంగా చోటుచేసుకునే చిన్నపాటి వివాదాలు సైతం పోలీస్‌స్టేషన్లకు చేరుతుండటంతో పరిస్థితులు మరింత సంక్లిష్టంగా మారుతున్నాయి. ఒక వర్గంపై చర్యలు తీసుకుంటే మరో వర్గం నుంచి విమర్శలు రావడం.. ఇరువర్గాలపై చట్టప్రకారం వ్యవహరిస్తే రాజకీయ కక్షసాధింపు ఆరోపణలు ఎదురుకావడం పోలీసులకు ఇబ్బందికరంగా మారుతున్నదనే చర్చ ఉంది.

ఖాకీలకు అసలు పరీక్ష ఇక్కడే..

పోలీసుల విధి రాజకీయ సమీకరణాలకు అనుగుణంగా కాకుండా చట్టానికి అనుగుణంగా ఉండాలి. స్థానిక రాజకీయాల్లో ఆధిపత్య పోరు, నాయకుల మధ్య విభేదాలు, పరస్పర ఆరోపణలు పోలీసుల విధి నిర్వహణపై ప్రభావం చూపకూడదనే అభిప్రాయం బలంగా వినిపిస్తోంది. అధికారంలో ఉన్నవారైనా.. ప్రతిపక్షంలో ఉన్నవారైనా.. చట్టాన్ని ఉల్లంఘిస్తే ఒకే విధమైన నిబంధనలు వర్తించాలనే నమ్మకం ప్రజల్లో కలగాలి. పోలీసు అధికారులు ఎలాంటి ఒత్తిళ్లకు లొంగకుండా నిష్పక్షపాతంగా వ్యవహరించినప్పుడే పోలీసు వ్యవస్థపై ప్రజల విశ్వాసం మరింత బలపడుతుంది.

రాజకీయాలకు దూరంగా.. చట్టానికి దగ్గరగా

పోలీసులపై రాజకీయ జోక్యం ఉందనే భావన ప్రజల్లో ఏర్పడటం ఏ పరిస్థితుల్లోనూ మంచిది కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు. రాజకీయ నాయకులు తమ మధ్య ఉన్న విభేదాలను రాజకీయ వేదికలపైనే పరిష్కరించుకోవాలి తప్ప.. ప్రతి వివాదాన్ని పోలీసులపైకి నెట్టడం వల్ల పోలీసు వ్యవస్థపై అనవసరమైన ఒత్తిడి పెరుగుతుందని అంటున్నారు. ప్రజల రక్షణ కోసం పనిచేసే పోలీసులకు స్వేచ్ఛగా విధులు నిర్వహించే అవకాశం కల్పించాల్సిన బాధ్యత రాజకీయ నాయకులపైనా ఉందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. పోలీసులు ఏ పార్టీకి అనుకూలంగా కాకుండా.. చట్టం పక్షాన నిలబడినప్పుడే న్యాయం జరుగుతుంది.

ఆదేశాలా..? చట్టమా..?

రాజకీయ ఒత్తిళ్లు ఎంత ఉన్నా పోలీసు అధికారుల ముందు చట్టమే ప్రథమ ప్రాధాన్యత కావాలనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. పైస్థాయి ఆదేశాలు, స్థానిక రాజకీయ ఒత్తిళ్లు, ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులు.. వీటన్నింటి మధ్య చట్టబద్ధంగా, పారదర్శకంగా నిర్ణయాలు తీసుకోవడమే పోలీసులకు అసలు సవాల్‌గా మారుతోంది. రాజకీయ నాయకుల మధ్య జరిగే పోరులో పోలీసులు పావులుగా మారకుండా.. చట్టమే చివరి మాట, న్యాయమే పోలీసుల లక్ష్యం అనే విధంగా వ్యవస్థ పనిచేయాల్సిన అవసరం ఉంది. లేదంటే రాజకీయ రగడలో నలిగిపోయేది కేవలం ఖాకీలు మాత్రమే కాదు.. ప్రజల్లో పోలీసు వ్యవస్థపై ఉన్న విశ్వాసం కూడా కావచ్చు.